కక్షసాధింపు చర్యలు తగవు : సిఐటియు

కడప అర్బన్‌: శాంతియుతంగా సమ్మె చేస్తున్న యుపి విద్యుత్‌ ఉద్యోగులపై అణచివేత చర్యలు, అరెస్టులకు పాల్పడుతున్న బిజెపి ప్రభుత్వ నిరంకుశ చర్యలు తగవని సిఐటియు జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కడప విద్యుత్‌ భవన్‌ ఆవరణంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. యుపి ప్రభుత్వ నియంతృత్వ పోకడలను, మొండివైఖరిని, సామూహిక సస్పెన్షన్లను తీవ్రంగా నిరసిస్తూ, సమ్మె చేస్తున్న యుపి విద్యుత్‌ ఉద్యోగులకు సంఘీభావంగా జిల్లా వ్యాప్తంగా నిరసనలు తెలపాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఉత్తర ప్రదేశ్‌ విద్యుత్‌ ఉద్యోగులు, ఇంజినీర్ల మూడు రోజుల సమ్మె విజయవంతమైందని తెలిపారు. గతేడాది డిసెంబరు 3న రాష్ట్రంలోని యోగి ఆదిత్యనాథ్‌ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాన్ని అమలు చేయాలని కోరుతూ ఈ నెల 16 నుంచి ఉద్యోగులు సమ్మె ప్రారంభించారని పేర్కొన్నారు. ఆ ఒప్పందం నుంచి ఎటువంటి కారణం లేకుండానే రాష్ట్రప్రభుత్వం వైదొలగిందని చెప్పారు.

'బిందు'తోనే నాణ్యమైన దిగుబడులు

- పెట్టుబడి వ్యయంలో గణనీయ తగ్గుదల
- జిల్లాలోని 36 మండలాల్లోనూ సూక్ష్మసేద్యం
- బిందుసేద్యం పరికరాల సరఫరాలోనూ పురోగతి
- ఎపిఎంఐపి ప్రాజెక్టు డైరెక్టర్ ఎం. రవీంద్రనాథరెడ్డి

ముఖాముఖి..

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

బిందుసేద్యం నాణ్యమైన దిగబడులకు చిరునామాగా నిలిచింది. ఫలితంగానే సూక్ష్మసేద్యానికి రోజురోజుకూ గిరాకీ పెరుగుతోంది. ఇందులోభాగంగా 2022-23 ఆర్థిక సంవ త్సరంలో ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించాం. ఇందులోభాగంగా అర్హులైన రైతుల్లో 80 శాతం మందికిపైగా పరిపరాలను సైతం అందించడమైంది. ఏడేళ్ల కిందటి నుంచి విభజిత కడప జిల్లాలోని 36 మండలాల్లో 65 వేల హెక్టార్లలో బిందుసేద్యం ద్వారా పంటలను సాగు చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో జిల్లాలోని పులివెందుల నియో జకవర్గ పరిధిలోని ఏడు మండలాల్లోనూ బిందుసేద్యం పెద్దఎత్తున సాగవుతోందని పేర్కొంటున్న ఎపిఎంఐపి ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.రవీంద్రనాథరెడ్డితో ప్రజాశక్తి ముఖాముఖి...

జిల్లాలో బిందుసేద్యం సాగు లక్ష్యమెంత?

2022-23 ఆర్థిక సంవత్సరంలో 20 వేల ఎకరాల్లో బిందుసేద్యం ద్వారా పంటలు సాగు చేయడమే లక్ష్యం. ఇందులో భాగంగా ఇప్పటికి 20,007 ఎకరాలకు బిందుసేద్యం చేయడానికి సంబంధించిన అనుమతుల కసరత్తును పూర్తి చేశాం. ఈనెలాఖరు నాటికి మరో 2,500 ఎకరాలకు బిందుసేద్యం సదుపాయం అందించే అవకాశం ఉంది.

సూక్ష్మసేద్యం దరఖాస్తులు వివరాలు తెలపండి?

14,995 దరఖాస్తులను స్వీకరించాం. ఈమేరకు 18,175 హెక్టార్లలో సాగు చేయడానికి అవకాశం ఉంది. ఇందులో 9,357 మంది రైతులు 11,167 హెక్టార్లలో ప్రాథమిక సర్వే చేశాం. ఇందులో 9,164 మంది 10, 928 హెక్టార్లకుగానూ అంచనా వేయ డమైంది. ఇందులో 6,686 మంది 8,004 హెక్టార్లకు మంజూరు చేశాం.

బిందుసేద్యం సబ్సిడీ వివరాలను తెలపండి?

బిందుసేద్య పరికరాలకు సబ్సిడీ వరిస్తుంది. ఇందులో ఐదె కరాలు లోపు కలిగిన రైతులకు 90 శాతం, పదెకరాలు కలిగిన రైతు లకు 70 శాతం చొప్పున సబ్సిడీ వర్తిస్తోంది.

బిందుసేద్యం సబ్సిడీ వర్తింపు గురించి చెప్పండి?

ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత ప్రాంత ఆర్‌బికె అధికారులు మొదటగా ప్రాథమిక సర్వే, బయోక్యూ చేసి అర్హమైన రైతులకు సిరఫాసు చేయడం తప్పనిసరి. వీటిని ఎపి ఎంఐపి పీడీ 10 శాతం, ఎపిడి 10 శాతం, హార్టీకల్చర్ అధికారు లు 20 శాతం, ఎంఐఎస్‌హెచ్‌జి 10 శాతం, ఆర్‌బికె ఇన్‌ఛార్జులు 10 శాతం చొప్పున క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నిర్ధారించడం జరుగు తుంది. అనంతరం లబ్ధిదారులు సబ్సిడీ మినహా మిగిలిన వాటాను జమ చేయడానికి ముందుకు వచ్చిన వారిని ఎంపిక చేస్తాం.

బిందుసేద్యం పట్ల ఆదరణకు గల కారణాలేమిటి?

కరువు పీడిత ప్రాంతాలు కావడం, నాణ్యమైన దిగుబడులకు అవకాశం ఏర్పడడం, కలుపు ఖర్చులు కలిసి రావడం తెలిసిం దే. దీనికితోడు నీటి ఆదా, ఎరువుల వినియోగ పరిమాణం, విద్యుత్ బిల్లుల్లో తగ్గుదల వంటి అదనపు సౌలభ్యాలు కలిసి రావడం కారణమని తెలుస్తోంది.

ఏజెన్సీలు సుముఖత చూపడం లేదనే వాదనపై మీరేమంటారు?

తెలియదు. జిల్లాలో 22 బిందుసేద్య ఏజెన్సీలున్నాయి. వీటి సహకారంతో జిల్లాలో సూక్ష్మసేద్యాన్ని పరుగులు తీయించాం. ఇప్పటివరకు నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించామంటే పరిస్థితి ఎంతో ఆశావహంగా ఉందని అర్థమవుతోంది.

బిందుసేద్యం సాగుకు ఆదరణ గల ప్రాంతాలేవి?

జిల్లావ్యాప్తంగా బిందుసేద్యం సాగుకు ఆదరణ లభిస్తోంది. ఇందులో పులివెందుల నియోజకవర్గ పరిధిలోని పులివెందుల, సింహాద్రిపురం, లింగాల, తొండూరు, వేముల, వేంపల్లి, చక్రాయపేట తోపాటు పెండ్లిమర్రి, ముద్దనూరు, కొండాపురం మండలాల్లో పెద్ద ఎత్తున బిందుసేద్యం ద్వారా పంటలు సాగు చేయడం కనిపిస్తోంది.

అకాల వర్షం..భారీ నష్టం

1,330 ఎకరాల్లో పంటలు నేలమట్టం
647 ఎకరాల్లో అత్యధికంగా దెబ్బతిన్న మొక్కజొన్న
ఏడు మండలాలు..22 గ్రామాలపై వర్షబీభత్సం

వేంపల్లెలో నేలరాలిన మామిడికాయలు

ప్రజాశక్తి - కడపప్రతినిధి

జిల్లాలో అకాలవర్షం ధాటికి భారీ నష్టం వాటిల్లింది. గత రెండ్రోజులుగా వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల ఫలితంగా జిల్లా వ్యాప్తంగా ఉద్యాన, వ్యవసాయ పంటలు నేలకొరిగిన సంగతి తెలిసిందే. జిల్లాలోని 36 మండలాల్లో కడప, వల్లూరు, పెండ్లిమర్రి, ముద్దనూరు, సిద్దవటం, చక్రాయపేట, వేంపల్లి, వీరపునాయునిపల్లి మండలాల పరి ధిలోని 22 గ్రామాల్లోని 1330 ఎకరాల్లో ఎనిమిది రకాల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇందులో అత్యధికంగా మొక్కజొన్న రైతాంగా నికి పెద్దఎత్తున నష్టం వాటిల్లడం ఆందోళన కలిగించింది. ఇందులో ప్రధానంగా 109 ఎకరాల్లో పొద్దుతిరుగుడు, 255 ఎకరాల్లో చామంతి, 20 ఎకరాల్లో సప్లవర్, 32 ఎకరాల్లో మినుములు, 647 ఎకరాల్లో మొక్కజొన్న, 120 ఎకరాల్లో వరి, 155 ఎకరాల్లో సజ్జ వంటి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈమేరకు వ్యవసాయశాఖాధి కారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి ప్రాథమిక నివేదికను రూపొందించారు. జిల్లా వ్యాప్తంగా అకాలవర్షం కారణంగా దెబ్బతిన్న పంటలు ఏ స్థాయిలో దెబ్బ తిన్నాయో అధికారులు నిర్ధారించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. 33 శాతాని కి మించి పంటలు దెబ్బతిని ఉంటే పంట నష్టం వాటిల్లినట్లు గుర్తించే అవకాశం ఉంది. అనంతరం పంటనష్టం వివరాలను ప్రభుత్వానికి పం పించనున్నట్లు తెలుస్తోంది.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న నాయకులు

జిల్లాలో అకాల వర్షాలకు నష్ట పోయిన పంటలను అంచనా వేసి రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి. దస్తగిరిరెడ్డి అధికారులను కోరారు. ఆదివారం మండలంలోని లింగారెడ్డి పల్లె, లక్కిరెడ్డిపల్లి తదితర గ్రామాలలో అకాల వర్షాలకు నష్టపోయిన రైతుల పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట పండి రైతులు పసుప, నూగు కలాలో చేతికి వచ్చిన పంటను అకాల భారీ వర్షంతో తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. రైతు భరోసా అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టం అంచనా వేయాలని పేర్కొన్నారు. పంట చేతి కొచ్చి అమ్ముకునే సమయంలో భారీ వర్షం తుఫాను రావడంతో పసుపు నూగు పంటలు కలంలో తడిసి ముద్ద అయిందని, విత్తనాలు మొలకలు వచ్చాయని తడిచిన పసుపు ధాన్యాన్ని అంతా ప్రభుత్వం మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని ఆయన తెలిపారు. జిల్లాలో పులివెందుల, వేంపల్లి ఇతర ప్రాంతాలలో అరటి, బొప్పాయి, చీనీ నిమ్మ మామిడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని ప్రభుత్వం అన్ని విధాలుగా రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఏ గోపాలకృష్ణయ్య సికె దిన్నె మండలం రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు రెడ్డి చిన్న సిద్దయ్య రైతులు వెంకట్రామిరెడ్డి సుబ్బారెడ్డి రామనాథ రెడ్డి చిన్న మల్లారెడ్డి శ్రీనివాసులరెడ్డి పెద్ద నారాయణరెడ్డి చిన్న నారాయణరెడ్డి గంగారపు సుబ్బారెడ్డి పాపన కేశవరెడ్డి గజ్జల అనిపిరెడ్డి చక్రవర్తి రంగారెడ్డి చిన్న వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

నేలకొరిన పంటలు పరిశీలన

వల్లూరు : రెండు రోజులుగా కురుస్తున్న ఈదురు గాలులకు, వర్షానికి నేలకొరిగిన వరి పంటను ఆదివారం లేబాక గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా నష్టం వాటిల్లిన పంటల నివేదిక తయారు చేయాలని మండల వ్యవసాయాధికారులను ఆదేశించారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు అందుబాటులో ఉండి రైతులకు సలహాలు సూచనలు అందంచాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

జగనన్న విద్యాదీవెన లబ్ధి పంపిణీ

ప్రజాశక్తి - కడప

2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని 46,134 మంది విద్యార్థులకు మంజూరైన లబ్ధి మొత్తం రూ. 33,41,00,888 మెగా చెక్కును విద్యార్థులు, వారి తల్లులకు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జెడి జయప్రకాష్, ఎస్‌సి , బిసి కార్పొరేషన్ల ఈడీలు డాక్టర్ వెంకట సుబ్బయ్య, వి. బ్రహ్మయ్య సంయుక్తంగా ఆదివారం పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ చరిత్రలోనే తొలిసారిగా పూర్తి స్థాయి ఫీజు రీయింబర్సుమెంటు పథకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేయడం రాష్ట్ర ప్రజల అదృష్టం అన్నారు. రాష్ట్రంలో ఐటీఐ, డిప్లమా, డిగ్రీ, ఆపై స్థాయి ఉన్నత విద్యను అభ్యసిస్తున్న ప్రతి విద్యార్థికి ముఖ్యమంత్రి అందిస్తున్న సువర్ణావకాశం అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న విద్య దీవెన సాయం అందుకుని.. చదువుపై ఏకాగ్రతతో.. భవిష్యత్ లక్ష్యం పైపు అడుగులేయాని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ, మైనారిటీస్, బీసీ, ఎస్సి, ఎస్టీ సంక్షేమ శాఖల అధికారులు, విద్యాశాఖ అధికారులు, జిల్లాలోని పలు డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్, నర్సింగ్ ఇతర ప్రొఫైషనల్ కోర్సుల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు.

ఆర్‌టిఐ చైర్మన్‌గా కోటపాటి లక్ష్మయ్య

ప్రజాశక్తి - కడప

నియామక పత్రం అందుకుంటున్న లక్ష్మయ్య

ఎపి యువజన కాంగ్రెస్ ఆర్.టి.ఐ చైర్మన్ గా కడపకు చెందిన కోటపాటి లక్ష్మయ్య నియమితుల య్యారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసి రెడ్డి చేతుల మీదగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ తన నియామకానికి కారకులైన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీకి, రాహుల్‌గాంధీ, రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్ర రాజుకు యువజన కాంగ్రెస్ జాతీయ ఇన్‌ఛార్జి కృష్ణ హోల్వారి, యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు బీ.వీ శ్రీనువాసులు ఆర్టిఐ జాతీయ చైర్మన్ అనిల్ కుమార్ మీనాకు హృదయ పూర్వకంగా ధన్య వాదాలు తెలియజేశారు. తన మీద నమ్మకం ఉంచి రాష్ట్ర పదవి ఇచ్చిన్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. పార్టీ కోసం నిరంతరం కష్టపడి పని చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నంది మండలం విజయ సుశీల్ కుమార్, యువజన కాంగ్రెస్ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు అమీర్ భాష, యువజన కాంగ్రెస్ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాపరి కారుణ్య కుమార్, యువజన కాంగ్రెస్ రాజం పేట అసెంబ్లీ ప్రెసిడెంట్ నంది మండలం వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

శస్త్రచికిత్సలో విప్లవాత్మక మార్పులు

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న వైద్యులు

సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, నెఫ్రాలజీ శస్త్ర చికిత్సలో మార్పులు చెన్నై అపోలో ఆసుపత్రి వారు తీసుకువచ్చారని అపోలో ఆసుపత్రి సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సంతోష్ ఆనంద్, కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ ట్రాన్స్ ప్లాంట్ ఫిజీషియన్ డాక్టర్ వెంకటేష్ రాజ్ కుమార్ వెల్లడించారు. ఆదివారం నాగరాజు పేటలోని అరుణాచల్ ఆసుపత్రిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహానగరాలకు వెళ్లే ఇబ్బంది లేకుండా కడపలోనే అపోలో ఆసుపత్రి వారు శస్త్ర చికిత్సలను ప్రారంభించారని తెలిపారు. కడపలో చాలామందికి రోబోటిక్ ద్వారా చెన్నై అపోలో ఆసుపత్రిలో స్వస్థత శిక్ష చేశామని వెల్లడించారు. సమావేశంలో డాక్టర్ నిరంజన్ రెడ్డి, డాక్టర్ మమతేశ్వరి పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి విజయం తథ్యం

చింతకొమ్మదిన్నె : రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధిస్తుందని మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ టి.వి. కృష్ణారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం మోహన్ బాబు పేర్కొన్నారు. టిడిపి పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు స్థానాలు గెలుపొందడంతో ఆదివారం మండల కేంద్రంలో టిడిపి నాయకులు భారీ ర్యాలీ నిర్వ హించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యావంతులు విజ్ఞతతో ముందు చూపుతో ఆలోచించి ప్రభుత్వానికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారని ఆయన పేర్కొన్నారు, అలాగే రాబోవు రోజుల్లో తెలుగుదేశం పార్టీకి పట్టంకటేందుకు ప్రజల ఎదరూ సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డి.వి. సుబ్బారెడ్డి, భాస్కర్ రెడ్డి, ఐటిడిపి ఛాంపియన్ దర్బార్ భాష, రాజారావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయం

- పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం. వి. రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి కడప అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

ప్రచార కార్యక్రమంలో తాను చేసిన వాగ్దానాలు, మేనిఫెస్టోలో పెట్టిన ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే అజెండాగా పనిచేస్తానని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రరెడ్డి అన్నారు. ఆదివారం ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం స్థానిక సాయి బాబా హై స్కూల్‌లో జిల్లా అధ్యక్షులు పి.వి.సుబ్బారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తానని చెప్పారు. రాష్ట్ర అధ్యక్షులు లెక్కల జమాల్ రెడ్డి మాట్లాడుతూ వెంటనే మూడు డీఏలు ప్రకటించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర గౌరవాధ్యక్షులు బి.సి. రెడ్డన్న మాట్లాడుతూ ఎప్పటికప్పుడూ ఉపాధ్యాయుల, విశ్రాంతి ఉపాధ్యాయుల పిఎఫ్, ఏపీజేఎల్‌ఐ, కమ్యూనికేషన్ వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. వి. సుబ్బారెడ్డి, ఆర్థిక కార్యదర్శి వెంకటసుబ్బయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మునిరెడ్డి, లెక్కల కొండారెడ్డి, రాష్ట్ర మైనారిటీ కన్వీనర్ మజహరుల్ హక్, అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్ను పల్లె ఓబుల్ రెడ్డి, జక్రియ బాషా, జిల్లా బాధ్యులు నారాయణరెడ్డి, షరీఫ్, లక్ష్మయ్య, చంద్రశేఖర్,హరి కొండయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ జయప్రదం చేయండి

కడప అర్బన్ : అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఏప్రిల్ 5న చలో పార్లమెంట్ పిలుపునిచ్చారని, దీనిని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి. శివకుమార్ వి. అన్వేష్ కోరారు. ఆదివారం స్థానిక వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో ఉపాధి హామీ రక్షణకై ఏప్రిల్ 5చలో ఢిల్లీ పేరుతో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎనిమిది సంవత్సరాల నుంచి బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గిస్తూ వస్తుందని విమర్శించారు. ఈ ఏడాది కూడా రూ.20 వేల కోట్లు తగ్గించిందని చెప్పారు. వ్యవసాయంలో రోజు రోజుకు పనులు తగ్గిపోవడంతో ఉపాధి పని కావాలని కోరే కూలీల సంఖ్య పెరుగుతుందని చెప్పారు. ఈ నేపథ్యంలో బడ్జెట్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు పెంచాల్సింది పోయి కేంద్రం కేటాయించిన నిధులు కూడా సకాలంలో కూలీలకు వారం వారం చేసిన పనులకు డబ్బులు చెల్లించడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐటి నాయకులు పాపిరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఫలితాలు వైసిపికి చెంపపెట్టు

కడప అర్బన్ : ఎమ్మెల్సీ ఫలితాలు వైసిపికి చెంపపెట్టులాంటివని టిడిపి జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు, కిరాతకం, ప్రతిపక్షాలను లేకుండా చేయడం, బాదుడే బాదుడు వల్ల 108 అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగిన మూడు పట్టభద్రుల ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో గెలిచారని పేర్కొన్నారు. ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చిన తర్వాత బుద్ధున్న ఎవరైనా రీకౌంటును కోరుకోరన్నారు. వైసిపి పెద్ద ఎత్తున డబ్బులు పంపిణీ చేసిందని, టిడిపి ఒక పైసా కూడా పంచలేదని పేర్కొన్నారు. కుప్పంలో చంద్రబాబు నాయుడుని, పాదయాత్రలో లోకేష్‌ను, పోలీసులతో అచ్చం నాయుడుని అరెస్టు చేయడాన్ని ఓటర్లు జీవించుకోలేకపోయారని తెలిపారు. పులివెందుల వాసి రామ్ గోపాల్ రెడ్డి ఎమ్మెల్సీగా గెలుపొందడం జగన్ పతనానికి నాందిని హెచ్చరించారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, కడప నియోజకవర్గ ఇన్చార్జి అమీర్ బాబు, నాయకులు జనార్ధన్, బండి జయశేఖర్ పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి - కడప అర్బన్

మందులు పంపిణీ చేస్తున్న బాబుభాయ్

నగరంలోని అల్మాస్ పేటలో ఉన్న జామియతుస్సాలిహత్ మదరసాలో కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రైమ్ హాస్పిటల్స్ వారి సహకారంతో ఘనంగా మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ప్రైమ్ హాస్పిటల్ వైద్యులు, యునాని వైద్య నిపుణులు హాజరయ్యారు. ఉచితంగా వైద్య సలహాలతో పాటు మందులు కూడా పంపిణీ చేశారు. దాదాపు 500 మంది ప్రజలకు వైద్య సేవలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ముక్తార్ అహ్మద్, కార్యదర్శి హిదాయతుల్ల, సహాయ కార్యదర్శి అర్షద్, కోశాధికారి జిలానీ, గౌరవ సలహాదారు బాబు భాయ్, పలువురు ప్రముఖులు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

విజయానికి కృషి చేసిన అందరికీ ధన్యవాదాలు

- ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మాట్లాడుతున్న భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

వైసిపి నాయ కులు ఎన్ని అరాచకాలు సృష్టించినా ధర్మమే విజయం సాధించిందని, ప్రజా స్వామ్యం వైపే ప్రజలు నిలబ డ్డారని ఎమ్మెల్సీగా గెలిచిన భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఈ పోరాటంలో ఓటర్లు ధర్మం వైపు నిలిచారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ ఎన్నో అరాచకాలను చేసిందన్నారు. దాదాపు రూ.50 కోట్లు ఖర్చు చేసిందన్నారు. అయినా ప్రజా సమస్యలపై ఎవరు పోరాడతారో ఆలోచించి రాయలసీమ ప్రజలు టిడిపిని గెలిపించారన్నారు. ఈనెల 13న జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి నాయకులు దొంగ ఓట్లు వేయడమే కాకుండా, లింగాల, తొండూరు గ్రామాల్లో తమ పార్టీ కార్యకర్తలపై దాడి చేశారన్నారు. పులివెందులలో కూడా దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నించారని, తాము, పార్టీ కార్యకర్తలు అడ్డుకున్నామన్నారు. రాబోయే 2004 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు టిడిపిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

తళుక్కుమన్న సినీ నటి హెబ్బాపటేల్

- గ్రీన్ ట్రెండ్స్ సెలూన్ ప్రారంభం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

సెలూన్‌ను ప్రారంభిస్తున్న హెబ్బాపటేల్

పులివెందుల పట్టణంలో ఆదివారం ప్రముఖ సినీ నటి హెబ్బా పటేల్ మెరిశారు. పార్నపల్లి రోడ్డులో నూతనంగా నిర్మించిన గ్రీన్ ట్రెండ్స్ సెలూన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నటి మాట్లా డుతూ దేశవ్యాప్తంగా ప్రాముఖ్యత చెందిన గ్రీన్ ట్రెండ్స్ సెలూన్ పులివెందుల పట్టణానికి రావడం ఎంతో సంతోషంగా ఉందని, ఈ అవకాశం ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశ వ్యాప్తంగా 411 బ్రాంచ్‌లతో పాటు మన రాష్ట్రంలో 92వ బ్రాంచ్‌ను పులివెందులలో ఏర్పాటు చేశారన్నారు. యువతి యువకులకు ప్రస్తుతం నడుస్తున్న ట్రెండ్‌కి అను గుణంగా వారి అందాలని ఈ సెలూన్ ద్వారా పొందవచ్చని పేర్కొన్నారు. తన చేత ఈ సెలూన్ ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నటి హెబ్బా పటేల్ ను చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున వచ్చారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు జగదీశ్వర్ రెడ్డి, ప్రజలు ఉన్నారు

ప్రజా వ్యతిరేకతని చెప్పలేం : వైసిపి

కడప : పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో ప్రజా వ్యతిరేకత వల్లే టిడిపి గెలిచిందని చెప్పలేమని వైసిపి రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్ అన్నారు. ఆదివారం మారుతి నగర్ లోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పశ్చిమ రాయలసీమ పరిధిలో 2.20 లక్షల ఓటర్లు మాత్రమే ఎన్నికల్లో పాల్గొన్నారని చెప్పారు. దీన్ని పరిగణలోకి తీసుకొని రాబోయే ఎన్నికల్లో ప్రభావం చూపిస్తుందని భావిస్తే అవివేకమవుతుందన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి విజయం సాధించడం శుభపరిణామన్నారు. టిడిపి మునిగిపోయే నావ అని, ఆ పార్టీని నమ్ముకుంటే ఎవరైనా మునిగిపోవాల్సిందేనని హెచ్చరించారు.

వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ

పోరుమామిళ్ల టౌన్ : పోరుమామిళ్ల బిసి హాస్టల్ వార్డెన్ మోహన్‌పై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకొని, సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి అన్నారు. ఈ సందర్భంగా బిసి హాస్టల్‌ను సందర్శించారు. బిసి హాస్టల్‌లో 90 మంది విద్యార్థులు ఉండగా వారికి మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని వాపోయారు. సరైన నీటి వసతి కల్పించలేదని తెలిపారు. బోజనం, నీటి వసతి గురించి విద్యార్థులు వార్డెన్ దృష్టికి తీసుకెళ్లగా పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. హాస్టల్లో సరైన ఫ్యాన్ సౌకర్యాలు లేవని, బాత్‌రూములు సక్రమగా లేవని చెప్పారు. వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని తెలియజేశారు. కార్యక్రమం ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, చిన్నికృష్ణ, భాస్కర్, ప్రసాద్, చరణ్, పృధ్వి పాల్గొన్నారు.

పీస్ స్కూల్‌లో కరాటే, తేక్వాండో వార్షిక పరీక్షలు

కడప అర్బన్ : కర్ణాటక (గుల్బర్గా) నుంచి వచ్చిన యాక్షన్ టీం సభ్యులు రహీమ్ గౌరీ, సన ఫాతిమా, ఫార్దేన్ ఖాన్, సయ్యదా శిరీన్ సుల్తానా, పీస్ స్కూల్ కరాటే మాస్టర్ మన్సూర్, విద్యార్థులకు రాత, మౌఖిక, ఆచారణాత్మకా ఆదివారం కరాటే, తేక్వాండో వార్షిక పరీక్షలను నిర్వహించారు. విద్యార్థులు ఈ వార్షిక పరీక్షలలో నేర్పు, శిక్షణ, మంచి పట్టుదలతో వారి ప్రతిభను నిరూపించుకున్నారు. విద్యార్థులందరు ఇందులో ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థులందరికి తల్లిదండ్రుల సమక్షంలో పీస్ స్కూల్ డైరెక్టర్ సయ్యద్ గౌస్ పీర్ సర్టిఫికెట్స్ ను అందించి ప్రోత్సహించారు.

కల్యాణం ఏర్పాట్లపై అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న టిటిడి ఇఒ ఎ.వి. ధర్మారెడ్డి

31 నాటికి 'కల్యాణం' ఏర్పాట్లు పూర్తి చేయాలి

- టిటిడి ఇఒ ఎ.వి. ధర్మారెడ్డి

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

టిటిడి అధికారులు, జిల్లా యంత్రాంగం కలిసి ఈనెల 31 నాటికి శ్రీ సీతారాముల స్వామివారి కల్యాణానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేయాలని టిటిడి ఇఒ ఎ.వి. ధర్మారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై కడప కలెక్టర్ విజయ్‌రామరాజు, ఎస్‌పి అన్బురాజన్, జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిటిడి అధికారులు, జిల్లా యంత్రాంగం సమన్వయం చేసుకుని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. కల్యాణ వేదిక వద్ద సిసి కెమెరాలు, కంట్రోల్‌రూమ్, బారికేడ్లు, గ్యాలరీలు, విద్యుత్ ఇతర పనులు పూర్తి చేయాలన్నారు. ఈనెలఖరులోగా మరోసారి పనుల పురోగతిపై క్షేత్రస్థాయి సమీక్ష నిర్వహి స్తామన్నారు. శ్రీసీతారాముల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారని చెప్పారు. కల్యానానికి విచ్చేసే భక్తులకు వారి గ్యాలరీల్లోనే అన్నప్రసాదం, తాగునీరు, అక్షింతలు అందించేలా ఏర్పాటు చేస్తామని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ కల్యాణనికి వచ్చే యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఎస్‌పి మాట్లాడుతూ గత ఏడాది 3,500 మందితో బందోబస్తు ఏర్పాటు చేశామని, ఈ సారి 4 వేల మందిని నియమిస్తున్నామని చెప్పారు. పార్కింగ్, సిసి కెమెరాలు, కంట్రోల్ రూమ్ నిర్వహణకు సంబంధించిన సిబ్బంది రెండు రోజుల పాటు విధుల్లో ఉంటారని తెలిపారు. అనంతరం బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కల్యాణ వేదిక వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, జెసి సాయికాంత్‌వర్మ, ఎస్‌విబిసి సిఇఒ షణ్ముఖకుమార్, టిటిడి సిఇ నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

వైసిపికి ఎలాంటి నష్టం ఉండదు

కడప అర్బన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపికి మూడు సీట్లు వచ్చినంత మాత్రాన వైసిపికి ఎలాంటి నష్టం ఉండదని ఆ పార్టీ ఎస్సీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షులు గుండ్లపల్లి గరుడాద్రి అన్నారు. ఆదివారం మాసాపేటలోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్ట భద్రుల ఎన్నికలను మనం మరో కోణంలో చూడాలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 108 నియోజకవర్గాల పరిధిలో జరిగిన ఎన్నికలు కేవలం నామ మాత్రపు ఎన్నికలుగా తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 2024 లో జరగబోవు సార్వత్రిక ఎన్నికలలో జగన్ మోహన్ రెడ్డి తనదైన శైలిలో అన్ని నియోజక వర్గాలలో వ్యూహాత్మకంగా గెలుస్తామని, 2వ సారి అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు.

పట్టభద్రుల తీర్పుతో కనువిప్పు కలగాలి

కడప: రాష్ట్రంలో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు చూసైన ముఖ్యమంత్రికి కనువిప్పు కలగాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జ తిరుమలేష్ పేర్కొన్నారు. ఆదివారం కడప నగరంలోని యూత్ కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తిరుమలేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యావంతులు, ఉద్యోగులు, యువకులు ప్రభుత్వంపై భరోసా కోల్పోయి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలను అధికార పార్టీకి ఇవ్వకుండా ప్రజలు ప్రతిపక్షాలకు ఇవ్వడం చూస్తుంటే జగన్ ప్రభుత్వం పై ప్రజల్లో పూర్తిగా నమ్మకం కోల్పోయినట్లు అనిపిస్తుందన్నారు. విలేకరుల సమావేశంలో యూత్ కాంగ్రెస్ ప్రొద్దుటూరు అసెంబ్లీ అధ్యక్షుడు వంశీ యాదవ్, యూత్ కాంగ్రెస్ నాయకులు నరసింహ, సాయి, అరుణ్ రెడ్డి పాల్గొన్నారు.

నోటీసులు ఇవ్వడం అప్రజాస్వామికం : డివైఎఫ్‌ఐ

ప్రజాశక్తి - బద్వేలు

జిఒ నెంబర్ ఒకటినీ రద్దు చేయాలని 20వ తేదీన ఛలో విజయవాడకి అఖిలపక్షాలు పిలుపును ఇస్తే వాటిని అడ్డుకోవాలని నోటీసులు ఇవ్వడం అప్రజాస్వామికమని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్‌ఐ) జిల్లా అధ్యక్షులు ముడియం.చిన్ని తెలిపారు. బద్వేలు ఆదివారం పోలీసులు ఆయనకు ముందస్తు నోటీలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలను అణిచివేసే క్రమంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నియంత పాలన సాగించే విధంగా జీవో నంబర్ 1ని తెచ్చారన్నారు. దీనిని యావత్ ప్రజలు, ప్రజా, కార్మిక, విద్యార్థి, యువజనులు వ్యతిరేకిస్తున్నారన్నారు. ఉద్యమాలపై ఉక్కుపాం మోపాలనుకోవడం అవివేకమని పేర్కొన్నారు.

నష్టం మిగిల్చిన వర్షం

- ఈదురు గాలులతో పంటలు నేలమట్టం
- భారీగా నష్ట పోయిన రైతులు
- ముద్దనూరులో అరటి, బొప్పాయి ధ్వంసం
- 176 ఎకరాల్లో పంట నష్టం
- ఎర్రగుంట్లలో కూలిన రేకుల ఇల్లు
- దంపతులకు గాయాలు

వేంపల్లె : నేల కొరిగిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి-వేంపల్లె/ముద్దనూరు/ ఎర్రగుంట్ల

వేంపల్లె మండలంలో వీచిన ఈదురు గాలులతో భారీ ఎత్తున పంటలు నేలమట్టమయ్యాయి. దీంతో భారీగా రైతులు, ప్రజలకు నష్టం వాటిల్లింది. శనివారం రాత్రి ఒక్క సారిగా ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వర్షం భారీగా కురిసింది. ఈదురు గాలుల ధాటికి అరటి, నిమ్మ, మామిడి, చీనీ చెట్లుతో పాటు నూగు, ప్రొద్దుతిరుగుడు, ఆకు తోటల పంటలు నెల కూలాయి. ఇంటిపైకప్పు రేకులు సైతం ఎగిరి పోయాయి. విద్యుత్ స్తంభాలు విరిగి పడడంతో అయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. భారీ వృక్షాలు రోడ్డుపై విరిగిపడి ట్రాఫిక్ సమస్య తలెత్తింది. మండలంలోని అలిరెడ్డిపల్లి, ఇడుపులపాయి, వీరన్నగట్టుపల్లె, కుమ్మరాంపల్లె, వేంపల్లె ప్రాంతాల్లో ఉన్న మామిడితోటల్లోని కాయలు పూర్తిగా రాలి పోవడంతో పాటు చెట్లు ఊడల్లో నుంచి విరిగి పడ్డాయి. మామిడి చెట్లుకు ఈ ఏడాది కాయలు విపరీతంగా కాశాయని, ఆకాలంగా వీచిన ఈదురు గాలులతో పూర్తిగా రాలి పోయినట్లు రైతులు వాపోతున్నారు. లక్షలు ఖర్చు చేసి ఆకు తోటలను సాగు చేస్తే ఈదురు గాలులతో ఆకు తోటలు అన్ని పూర్తిగా నెలకూలినట్లు ఆకుతోట రైతు కటిక రాజా అవేదన వ్యక్తం చేశారు చేతికి వచ్చే సమయంలో నూగు, పొద్దుతిరుగుడు పంటలు కూడ దెబ్బతినాయని వాపోయారు. అయా ప్రాంతాల్లో దాదాపు 50 కరెంటు స్తంభాలు నెలకూలినట్లు విద్యుత్ అధికారులు చెప్పుకొస్తున్నారు. విద్యుత్ శాఖ ఎడిఎ శ్రీకాంత్ ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది పనులు చేసి రైతులకు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. వేంపల్లెలోని బిడాలమిట్ట, రాజారెడ్డి నగర్ ప్రాంతంలో ఉన్న షేక్ సుభాన్, కుమార్ అనే వ్యక్తులకు చెందిన ఇళ్లు కూలి ఇంట్లో ఉన్న సామాగ్రి దెబ్బతిన్నాయి. ఇంటికి పై కప్పుగా పెట్టుకొన్న రేకులు ఈదురు గాలులకు ఎగిరి దూర ప్రాంతాల్లో పడ్డాయి. ఎలాంటి ప్రమాదాలు జరగక పోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. గంట పాటు వీచిన ఈదురు గాలులతో రైతులకు కోట్లాది రూపాయలు నష్టం వాటిల్లింది. వేంపల్లెలోని కాపు వీధి, గండి రోడ్డు, రోడ్డు భవనాల శాఖ అతిథి గృహం సమీపంలో ఉన్న ఏళ్ల నాటి చెట్లు విరిగి పడ్డాయి. తగేండుపల్లె సమీపంలో చక్రపాణిరెడ్డి, రెడ్డమ్మ, చైతన్య రెడ్డి, చేతన్ రెడ్డిలకు చెందిన 22 ఎకరాల్లో అరటి తోట నెలకూలడంతో రైతులు లబోదిబోమంటున్నారు. నాలుగు సంవత్సరాలుగా మామిడి తోటలు నష్టపోతున్నామని ఈసారైన కాపు రావడంతో అదాయం పొందువచ్చనే ఆశగా ఉన్న సమయంలో గాలివాన బీభత్సంతో ఆశలు అడియాశలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసారైన ప్రభుత్వం మామిడి తోటల రైతులను ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ఈదురు గాలులకు హర్టికల్చర్ అధికారుల ప్రాథమిక అంచనా మేరకు మండలంలో అరటి 255 ఎకరాల్లో 102 మంది రైతులు నష్ట పోయారు. 30 ఎకరాల్లో 12 మంది రైతులకు చెందిన చీనీ, 63 మంది రైతులకు చెందిన 141 ఎకరాలు నిమ్మ, 78 మంది రైతులకు చెందిన 132 ఎకరాల్లో తమలపాకుకు నష్టం వాటిల్లింది. 138 మంది రైతులకు చెందిన 583 ఎకరాల్లో మామిడి, ఇద్దరి రైతులకు చెందిన 3 ఎకరాల్లో బొప్పాయి, ఒక రైతుకు చెందిన 2 ఎకరాల్లో మునగ పంట నష్టం జరిగిందని అధికారులు అంచనా వేస్తున్నారు.

రూ. 4 లక్షల నష్టం..

ఆకాలంగా ఈదురు గాలులు వీచడంతో మామిడి తోటలు నెలకూలి రూ. 4 లక్షలు నష్టం వాటిల్లింది. అలిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని పాపాఘ్ని నది సమీపంలో 14 ఏళ్ల కిందట 3 ఎకరాల్లో బెనిషా రకానికి చెందిన 220 మామిడి చెట్లు సాగు చేశాను. మామిడి చెట్లుకు కాపు ఎక్కువగా ఉన్న సమయంలో ఈదురు గాలులు వీచి పూర్తిగా రాలి పోయాయి. అలాగే బెనిషా రకంకు చెందిన 15 చెట్లు ఊడల్లో నుంచి పైకి లేచి నెలకూలాయి. ప్రభుత్వం మామిడి తోటలు రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి

-మహబూబ్ బాషా, రైతు - వేంపల్లె

చేతికి వచ్చే సమయంలో..

మామిడి కాయలను మార్కెట్‌కు తీసుకెళ్లి సమయంలో గాలివానతో నష్టం వాటిల్లింది. చెట్లకు కాయలు విరివిగా కాసినప్పటికీ ఆదాయం చేతికి వస్తుందనుకునేలోపు ఈదురు గాలులు బలంగా రావడంతో చెట్లకు ఉన్న పూర్తి కాయలు రాలిపోయాయి. అలిరెడ్డిపల్లి పోలంలో నాలుగున్నర ఎకరాల్లో 250 మామిడి చెట్లను పెంచాను. ఉగాది పండుగకు మామిడి కాయలు కోసి మార్కెట్ క తరలించాలని అనుకొన్నాను. అంతలోనే లక్షల్లో నష్టం జరిగింది. ప్రభుత్వం మామిడి తోటల రైతులను ఆదుకోవాలి.

- చాన్‌బాష - రైతు, వేంపల్లె.

ముద్దనూరులో.. గాలివాన బీభత్సానికి మండలం లోని దేనేపల్లె పంచాయతీలో 176 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లింది. అరటి, బొప్పాయి చెట్లు, కొర్ర, పొద్దుతిరుగుడు, మామిడి పంటలు భారీగా దెబ్బతిన్నాయి. శనివారం ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి మండలంలోని బొందలకుంట, ఆరవేటి పల్లె, దేనేపల్లె గ్రామాల్లో భారీగా పంట నష్టం వాటిల్లినట్లు బాధిత ఆవేదన వ్యక్తం చేశారు. ఆరవేటి పల్లెలో 50 ఎకరాల్లో అరటి చెట్లు, 20 ఎకరాల్లో బొప్పాయి చెట్లు ధంసమయ్యాయని వాపోయారు.

ముద్దనూరు : పడిపోయిన అరటితోటను పరిశీలిస్తున్న సర్పంచు, నాయకులు

దేనేపల్లి గ్రామంలో కొర్ర 40 ఎకరాలు, పొద్దుతిరుగుడు 40 ఎకరాలు,10ఎకరాల మామిడి పంట నష్టం వాటిల్లిందని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బొందలకుంటలో 16 ఎకరాల్లో అరటి చెట్లు నేలకొరిగాయి. పంచాయతీ సర్పంచ్ పెద్దక్క, నాయకులు శ్రీనివాసులు పంటలు పరిశీలించారు. పంట నష్టంపై రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులకు తెలియజేసినట్లు వారు చెప్పారు. పంట నష్టంపై నివేదిక తయారు చేసి పంట కోల్పోయిన రైతులకు పరిహారం అందేలా చూడాలని సర్పంచ్ వ్యవసాయాధికారులకు సూచించారు.

ఎర్రగుంట్లలో.. మండల పరిధిలోని దండుపల్లిలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రేకుల ఇల్లు పూర్తిగా నేలమట్టమయింది. ఆ సమయంలో ఇంటి యజమానులైన ఎర్రగొర్ల కృష్ణయ్య, అతని భార్య వెంకట లక్ష్మమ్మ ఇంట్లోనే ఉన్నారు. గ్రామస్తులు వెంటనే గమనించి వారిని బయటకు తీసుకురావడంతో ఇరువురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు గాయపడిన దంపతులను 108 వాహనం ద్వారా ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రొద్దుటూరులోని ప్రయివేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. సంఘటన స్థలంలో తాము ఉండడంతో వెంటనే సహాయక చర్యలు చేపట్టి వారిని ప్రాణాపాయం నుంచి రక్షించామని గ్రామస్తులు పేర్కొన్నారు.

ఎర్రగుంట్ల : పడిపోయిన రేకుల ఇల్లు

పంట నష్టం సిఎం దృష్టికి : ఒఎస్‌డి

నేలకొరిగిన తమలపాకు తోటలను పరిశీలిస్తున్న ఒఎస్‌డి, జడ్‌పిటిసి, ఎంపిపి

ప్రజాశక్తి - వేంపల్లె

ఈదురు గాలులతో దెబ్బ తిన్న పంట నష్టాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని పులివెందుల ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇడుపులపాయ, వేంపల్లె, అమ్మగారిపల్లె, వీరపునాయునిపల్లె మండలంలోని తగేండుపల్లె ప్రాంతాల్లో ఈదురు గాలులకు దెబ్బతిన్న అరటి, మామిడి, నిమ్మ ఆకు తోటలు, నూగు, ప్రొద్దుతిరుగుడు పంటలను ఆదివారం జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి, ఎంపిపి లక్ష్మిగాయత్రి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డితో కలిసి ఒఎస్‌డి పరిశీలించారు. పంట నష్టంపై రైతులతో మాట్లాడారు. అనంతరం ఒఎస్‌డి మాట్లాడుతూ ఈదురు గాలులు బలంగా రావడంతో పంటలు నష్టపోవడం చాల దురదృష్టకరమన్నారు. రైతులకు న్యాయం చేసేలా పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఆదాయం వచ్చే సమయంలో ప్రకృతి కన్నెర్ర చేయడంతో మామిడి కాయలు రాలి, లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. ఆకు తోటలను సాగు చేసేందుకు లక్షల రూపాయలు ఖర్చు చేశామని రైతులు వివరించారు. ప్రతి ఏడాది ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్నామని తమలపాకు రైతులు వాపోయారు. రైతులను ఆదుకునేందుకు నివేదికలు ప్రభుత్వానికి పంపిస్తామని ఒఎస్‌డి హామీ ఇచ్చారు. పంట నష్టంపై సర్వే చేసి నివేదికను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇడుపులపాయి సర్పంచు చలపతి, ఉద్యానశాఖాధికారి రెడ్డయ్య, వ్యవసాయ అధికారి రాజేంద్ర ప్రసాద్, ఎంపిటిసి కటిక చంద్ర, వార్డు మెంబర్ ముత్యాల ఆంజనేయులు, ఆయా శాఖల అధికారులు, రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : పిసిసి

వడగండ్ల వాన, ఈదురు గాలులకు తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి కోరారు. దెబ్బతిన్న పంటలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ ఈదురు గాలులకు మామిడి, అరటి, తమలపాకు తోటలు, నర్సరీలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. కోట్లాది రూ పాయలు రైతులు నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే పంట నష్టం నివేదికలను తెప్పించుకొని సత్వరం రైతులకు ఆర్థికసాయం అందజేయాలన్నారు. జిఒ 77ను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకొని పేద విద్యార్థులకు పిజి విద్యను అందించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు నరసింహారెడ్డి, రామకృష్ణ, ఉత్తన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ విజయంపై టిడిపి సంబరాలు

ముద్దనూరులో సంబరాలు చేసుకుంటున్న నాయకులు

ప్రజాశక్తి - ముద్దనూరు

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీగా టిడిపికి చెందిన భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి విజయంపై ఆదివారం ఆ పార్టీ నాయకులు ఘనంగా సంబరాలు చేసుకున్నారు. జమ్మలమడుగు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మండల ఇన్‌ఛార్జి శివరామిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక టిడిపి కార్యాలయం, పాత బస్టాండ్ కూడలిలో నాయకులు, కార్యకర్తలు బాణాసంచా పేల్చి స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రంగారెడ్డి, సత్తార్, భాస్కర్‌రెడ్డి, వినోద్, నాగేష్, ఓబులేష్, శివశంకరరెడ్డి, రామకృష్ణాడ్డి పాల్గొన్నారు. **చాపాడు :** పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి బి.రామగోపాల్‌రెడ్డిని గెలిపించి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను స్పష్టంగా తెలియజేశారని టిడిపి మండలశాఖ అధ్యక్షులు అన్నవరం సుధాకర్‌రెడ్డి తెలిపారు. టిడిపి అభ్యర్థి విజయం సాధించడం పట్ల స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఆదివారం టపాసులు పేల్చి, కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికలు 2024 ఎన్నికల్లో జరగబోయే శాసనసభ ఎన్నికలకు రెఫరెండంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టిఎ పల్లి రవిశంకర్‌రెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మేకల సుదర్శన్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మేకల బాబు, లోకేష్, శేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, ఎన్ఆర్ఐ అబ్దుల్ కరీం, రామ్మోహన్, నారపరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ఖాజీపేట :** ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపికి వివిధ వర్గాల వారు తగిన బుద్ధి చెప్పారని, రానున్న ఎన్నికల్లో టిడిపి తప్పక ఘన విజయం సాధించి అధికారంలోకి వస్తుందని రావులపల్లె పంచాయతీ పదో వార్డు సభ్యులు తుట్టే రాముయాదవ్ అన్నారు. ఆదివారం ఖాజీపేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి విద్యావంతులను, ఉద్యోగులను, నిరుద్యోగులను, యువతను నమ్మించి మోసగించారన్నారు. జగన్ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత ఉందనేది స్పష్టంగా కనిపించిందని తెలిపారు.



చాపాడులో కేక్ కట్ చేసి తినిపించుకుంటున్న నాయకులు

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

పులివెందుల రూరల్ : ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పురపాలక చైర్మన్ వరప్రసాద్ సూచించారు. నలభై రోజులుగా మహిళలకు, యువతకు శ్రీ సత్యసాయి కళ్యాణ మండపంలో బ్యాంకర్లు గ్రామీణ, ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ సౌజన్యంతో శ్రీ సత్యసాయి సేవా సంస్థల సహకారంతో టైలరింగ్ ఫ్యాషన్ డిజైనింగ్‌పై ఉచితశిక్షణనిచ్చారు. ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం ఆ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మునిసిపల్ చైర్మన్ వరప్రసాద్, సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణరావు పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్యక్రమ ఇన్‌ఛార్జి నాగప్రసాద్, జిల్లా అధ్యక్షులు సురేంద్ర, సిహెచ్ సురేంద్ర, జి వెంకటరమణ పాల్గొన్నారు.

చిన్నదండ్లూరులో దేవర

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిన్న దండ్లూరు గ్రామంలో ఆదివారం పెద్దమ్మ తల్లి దేవరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి, గంగవరం శేఖర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉన్నత లక్ష్యంతో చదవండి : సిఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విద్యార్థులు ఉన్నత లక్ష్యం నిర్దేశించుకొని చదవాలని జమ్మలమడుగు అర్బన్ సిఐ సదా శివయ్య సూచించారు. స్థానిక బాలాజీ హైస్కూల్‌లో ఆదివారం పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సిఐ సదాశివయ్య మాట్లాడుతూ పదవ తరగతిలో సాధించే మార్కులు భవిష్యత్‌కు పునాది లాంటివన్నారు. 150 మంది పదవ తరగతిలో ఉన్నారంటే.. పట్టణంలోనే ఒక పెద్ద స్కూల్ అని.. అంతే గొప్పగా మీ ఆశయాలు ఉండాలన్నారు. వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలని సిఐ ఆకాంక్షించారు. గౌతమ మహిళ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ నాగూర్ మాట్లాడుతూ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తు పెట్టుకొని ఇష్టపడి చదివి మంచి స్థాయికి రావాలని కోరారు. బాలాజీ హైస్కూల్ విద్యా సంస్థల అధినేత మాట్లాడుతూ ఇక్కడ చదివి, ఇదే స్కూల్‌కు ఉన్నత స్థాయిలో ముఖ్య అతిథిగా రావాలని కోరారు. ఉపాధ్యాయులు సూర్యమిత్ర, భరత్‌కుమార్ , ప్రసాద్‌రెడ్డి, ఖాసీం, హృషి, హేమలత, బాషా ప్రసంగించారు. సిఐ సదాశివయ్యను సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మాట్లాడుతున్న సిఐ సదాశివయ్య

ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు హర్షణీయం

ప్రజాశక్తి - ఖాజీపేట

గ్రామీణ ప్రాంత పేదల కోసం ఉచితంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం హర్షణీయమని ఎపిఐఐసి రాష్ట్ర డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్‌రెడ్డి, ఎంపిపి అబూబకర్ సిద్దిక్ తెలిపారు. టీచర్స్ కాలనీలోని షాదీఖానా మందిరంలో ఆదివారం మైదుకూరు పట్టణానికి చెందిన ఎస్ఎల్ఆర్ హాస్పిటల్స్ యాజమాన్యం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మూలె అనిల్‌కుమార్‌రెడ్డి రోగులను పరీక్షించి, ఉచితంగా మందలను అందజేశారు. అనంతరం డాక్టర్ మూలే అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ తరహాలో తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యాన్ని అందించేందుకు తాము కృషి చేస్తున్నామన్నారు. తమ ఆసుపత్రికి వచ్చే వారికి ఎప్పుడూ సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

రాంగోపాల్ రెడ్డి విజయం మార్పునకు నాంది

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి విజయం మార్పునకు నాంది అని ఎమ్మెల్సీ బిటెక్ రవి తెలిపారు. ఇందుకోసం ప్రతి కార్యకర్త, నాయకులు ఎంతో కృషి చేశారని ఆదివారం నూతనంగా నిర్మిస్తున్న టిడిపి కార్యాలయం సమీపంలో ఆయన విలేకరులతో పేర్కొన్నారు. సోషల్ మీడియా ద్వారా ప్రతి ఓటరుకు దగ్గరయ్యారని తెలిపారు. రాంగోపాల్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించినప్పటి నుంచి తన కుటుంబ సభ్యులు అందరూ కలిసి దాదాపు 5 నెలలుగా ప్రజల్లోకి వెళ్లి కష్టపడ్డారని, వారి కష్టానికి ఫలితం వచ్చిందన్నారు. సోషల్ మీడియా ద్వారా రాంగోపాల్‌రెడ్డి తను ఏమి చెప్పదలుచుకున్నారో అన్ని అంశాలను ప్రతి ఓటరుకు అందేలా చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షులు బ్రాహ్మణపల్లి వెంకటరామిరెడ్డి, పట్టణ అధ్యక్షులు కొరియర్ ప్రసాద్, యువ నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ విభాగపు కార్యదర్శి బాషా పాల్గొన్నారు.

చౌడేశ్వరి అమ్మవారికి జ్యోతులు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని అప్పనపల్లి, రంగాపురం గ్రామాల్లో ఆదివారం చౌడేశ్వరి అమ్మవారి తిరుణాల సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతుల కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాలు బంధువులు, కుటుంబ సభ్యులతో కళకళలాడాయి. గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు ఎపిఐఐసి రాష్ట్ర డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్ రెడ్డి, ఎంపిపి అబుబకర్ సిద్దిక్, మండల వైసిపి నాయకుడు మురళీమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రేషన్ మాఫియాపై అధికారుల అలసత్వం

ప్రొద్దుటూరు టౌన్ : మండలంలో పదేపదే రేషన్ బియ్యం పట్టుబడుతున్నా రెవెన్యూ అధికారులు అలసత్వం వహిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు అప్ప పోగుల, మైనార్టీ నాయకులు చాగలమర్రి ఖాదర్‌బాషా, షేక్ ఖలందర్, మౌలాలి ఒక సంయుక్త ప్రకటనలో ఆరోపించారు. నాలుగు రోజుల క్రితం పట్టణంలోని ఆటోనగర్‌లో బియ్యం పట్టుబడినా రెవెన్యూ అధికారులు బయటకు పొక్కనీయలేదన్నారు. రేషన్ డీలర్లు బియ్యం మాఫియాతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. స్థానిక కొందరు రాజకీయ నాయకులు, రెవెన్యూ అధికారుల ప్రమేయంతోనే రేషన్ మాఫియా రాజ్యమేలుతోందని వారు ఆరోపించారు.

కెఎస్ఆర్ఎం కళాశాలలో ఉచిత వైద్య శిబిరం

కడప అర్బన్ : నగర శివారులోని కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి ద్వితీయ కుమారుడు కె. యదార్థ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఎన్ఎస్ఎస్ విభాగం, శ్రీ సాయి నర్సింగ్ హోమ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి, ఆర్థోపెడిక్ మెగా వైద్య శిబిరాన్ని కళాశాల ట్రైనింగ్, ప్లేస్మెంట్ భవనంలో నిర్వహించారు. ప్రముఖ కంటి వైద్యురాలు డాక్టర్ ఎస్. మాధవి, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సుబ్రమణ్య రావు హాజరయ్యారు. కళాశాల సిబ్బందికి, పరిసర ప్రాంత స్థానిక నివాసులకు కంటి,ఆర్థోపెడిక్ పరీక్షలు చేశారు. మెరుగైన సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఆచార్యులు డాక్టర్ వి. ఎస్. ఎస్. మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి. ప్రేమ్ కుమార్, వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వెలుగులోకి 14వ శతాబ్దపు శాసనం, విష్ణుమూర్తి విగ్రహం

ప్రజాశక్తి - దువ్వూరు

మండల పరిధిలోని భీమునిపాడు గ్రామంలో 14వ శతాబ్దపు శాసనాన్ని, విష్ణుమూర్తి విగ్రహాన్ని గుర్తించినట్లు చరిత్రకారుడు, రచయిత బొమ్మిశెట్టి రమేష్ ఆదివారం తెలిపారు. విజయనగర సామ్రాజ్య రెండవ హరిహర రాయలు (పాలన క్రీ.శ. 1377-1404) క్రీస్తు శకం 1394 ఏప్రిల్ 11వ తేదీ శనివారం ములికినాడులోని భీమునిపాడులో లక్కీ నాయిని కొడుకు కసవన వేయించినట్లు శాసనంలో లిఖించబడినదని రమేష్ తెలిపారు. భీమునిపాడు గ్రామంలోని కోదండరామ స్వామి ఆలయం దగ్గరగా శాసనం, ఆలయం ఎడమవైపు రెండు నుంచి మూడు అడుగుల విష్ణుమూర్తి విగ్రహాన్ని గుర్తించినట్లు బొమ్మిశెట్టి వివరించారు. ఏడు నుంచి ఎనిమిది అడుగుల హనుమంతుని విగ్రహ ప్రతిష్ట చేసినట్లు శాసనంలో పేర్కొనబడినదని అన్నారు. పురాతనమైన హనుమంతుని విగ్రహం ఎండ తీవ్రతలకు పగలడంతో గ్రామ పూజారులు ఉండకూడదని చెప్పడంతో గ్రామ పెద్దలు అన్నవరం ఏట్లో పడేశారని భీమునిపాడు గ్రామస్తుడు, లాయర్ కుప్పన్న గారి సూర్యనారాయణరెడ్డి తనకు చెప్పారని రమేష్ తెలిపారు. నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన ఆవుల నరసింహ ప్రసాద్ తనకు ఈ శాసనం గురించి చెప్పగా శీలం అరవింద్‌తో కలిసి శాసనాన్ని, విష్ణుమూర్తి విగ్రహాన్ని సందర్శించినట్లు బొమ్మిశెట్టి రమేష్ తెలిపారు. శాసనం, విష్ణుమూర్తి ఛాయాచిత్రాలు మైసూర్ పురావస్తు శాఖ డైరెక్టర్ మునరత్నం రెడ్డికి పంపగా ఆయన నిశితంగా పరిశీలించి ఇవి 14వ శతాబ్దపు నాటివని నిర్ధారణ చేశారని వివరించారు. కడప జిల్లా 3 వాల్యూమ్స్ శాసనాలలో ఈ శాసనం గురించి లేదని చరిత్రకారుడు, రచయిత తవ్వా ఓబుల్‌రెడ్డి తనకు చెప్పారని, శాసనం చాలా అరుదైనదని గుర్తించినందుకు అభినందనలు తెలిపారన్నారు.



శిలాశాసనం



విష్ణుమూర్తి విగ్రహం

ఐక్యతతో ఏదైనా సాధించవచ్చు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఐక్యంగా పనిచేస్తే ఏదైనా సాధించవచ్చని మున్సిపాలిటీ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ గోటూరు చిన్నప్ప, రాష్ట్ర వాల్మీకి సంఘం డైరెక్టర్ అంబకపల్లె నారాయణస్వామి తెలిపారు. శ్రీ వెంకటేశ్వర ఎరుకల సంఘం నూతన కమిటీ సమావేశాన్ని ఆదివారం నగిరిగుట్టలో ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు మాట్లా డుతూ మనకు రావాల్సిన ప్రభుత్వ పథకాలను సాధించుకునేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పోరా డాలన్నారు. ప్రభుత్వం ఎస్‌టిలకు ప్రత్యేక నిధులను కేటాయించిందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒకప్పుడు నగిరిగుట్ట ఎరుకల వారు అంటే పట్టణంలో భయభ్రాంతులకు గురయ్యేవారన్నారు. కాలక్రమేణా నాగరికత పెరగడంతో ఐకమత్యంగా కలిసిపోయారన్నారు. ప్రతి ఒక్కరూ అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండి, మన హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షునిగా చెన్నకేశవులు, ఉపాధ్యక్షులుగా బాలయ్య, కె.అంజన్నప్ప, యూత్ ప్రెసిడెంట్‌గా వెంకటపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ముఖ్యఅతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రామచంద్ర, చలపతి, వంశీ, శ్రీకాంత్, కిషోర్, రఘు, శివ, అశోక్, రామ్మోహన్ పాల్గొన్నారు.

కమిటీ అధ్యక్షులను సన్మానిస్తున్న ముఖ్యఅతిథులు

సొంత నిధులతో రహదారి పనులు

కొండాపురం : మండలంలోని టి.కోడూరు గ్రామానికి చెందిని లింగారెడ్డిగారి రామమునిరెడ్డి అయిదేళ్లుగా తన సొంత నిధులతో పలు అభివృద్ధి పనులు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. గ్రామ ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా ముందుకు వచ్చి తన సొంత నిధులు ఖర్చు చేస్తున్నారు. జాతీయ రహదారి నుండి కోడూరు వైపునకు వెళ్ళే రహదారి కంపచెట్లతో అల్లుకు పోవడంతో ఆదివారం కిలోమీటర్ పొడవున రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంప చెట్లను తొలగించే చర్యలు చేపట్టారు. ఆయన చేస్తున్న పనులను గ్రామస్తులు అభినందించారు.

విద్యుత్ లైన్లకు మరమ్మతులు

వేంపల్లె : ఈదురు గాలులకు నేలకూలిన కరెంటు స్తంభాల మరమ్మతులను ఆ శాఖాధికారులు, సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. వడగళ్ల వర్షానికి, ఈదురు గాలులకు వక్షాలు పడిపోవడంతో వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లో విద్యుత్ తీగలు తెగి, విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ ఎస్ఇ ఆదేశాల మేరకు డిఇ నాయక్, ఎడిఎ శ్రీకాంత్ ఆధ్వర్యంలో సిబ్బంది వర్షంలోనే రాత్రి పగలు అందరూ విధుల్లో ఉండి విద్యుత్ లైన్లు మరమ్మతులు చేపట్టారు. సకాలంలో నెలకొరిగిన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజలు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు అల్లాడుపల్లె వేద పండితుడికి సన్మానం

చాపాడు : అల్లాడుపల్లె దేవళాలులోని వేద పండితుడు వెలుతుర్ల నరేంద్రశర్మకు సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు దొంతు సుబ్రమణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. సర్ సివి రామన్ అకాడమీ సేవా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో రుద్రాక్ష వైభవ ఆధ్యాత్మిక పీఠం వారు సువర్ణ కంకణంతోపాటు సామవేద శిఖామణి బిరుదుతో ఘన సత్కారం చేసిన విషయం విదితమే. మండలంలోని ఆర్యవైశ్యులు, నరేంద్ర స్వామి శిష్య బృందం ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

డిఎలకు మోక్షమెప్పుడో? : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డిఎలను ఎప్పుడు చెల్లిస్తుందో తెలియజేయాలని తెలపాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిల చెల్లింపులో నిర్లక్ష్యం వహిస్తూనే ఉన్నదని పేర్కొన్నారు. ఇప్పటికే నాలుగు డిఎలు పెండింగ్ ఉన్నప్పటికీ ఒక్కటీ చెల్లించకపోవడ దారుణమని చెప్పారు. తెలుగువారి ఉగాది పండుగ పురస్కరించుకుని అయినా రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్లో ఉన్న డిఎలను అన్నింటిని విడుదల చేయాలని కోరారు.

నేడు యథావిధిగా ప్రజాఫిర్యాదులు స్వీకరణ

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10.00 గంటలకు స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమం జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గిరీష పిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందనకు రావాలన్నారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎస్ఎల్ఎ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అలాగే స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రొటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

పరిశ్రమల స్థాపనతో యువతకు ఉపాధి

జిల్లా పరిశ్రమల అధికారి జె.నాగరాజు

ముఖా ముఖి..

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో పరిశ్రమల స్థాపనతో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, పారిశ్రామికవేత్తలు, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి జె. నాగరాజా పేర్కొన్నారు. నూతనంగా ఏర్పాటైన అన్నమయ్య జిల్లాలో నిరుద్యోగ, యువత పరిశ్రమలు ఎలా స్థాపించాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.

జిల్లాలో ఎన్ని పరిశ్రమలు ఉన్నాయి? ఎంత మందికి ఉపాధి కల్పించారు?

జిల్లా వ్యాప్తంగా కలెక్టర్ గిరీష సహకారంతో 3859 పరిశ్రమ లున్నాయి. సూక్ష్మ చిన్న ,మధ్య తరహా పరిశ్రమలున్నాయి. సుమారు రూ. 277.8 కోట్ల పెట్టుబడులతో 21, 859 మందికి ఉపాధి కల్పించాం. సింగల్ డేస్క్ పోర్టల్ ద్వారా అనుమతులు పొందాం. వివిధ దశలలో 142 పరిశ్రమలు ఉన్నాయి. సుమారు రూ. 133 కోట్ల పెట్టుబడి అంచనాతో 1585 మందికి ఉపాధి అవకాశాలు కల్పించాం.

జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలేంటి?

జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఇప్పటివరకు మూడు, నాలుగు సార్లు పరిశ్రమల స్థాపన కోసం ఔత్సాహికులకు అవగాహన సదస్సులు నిర్వహించాం. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు అనేక అనుమతులు మంజూరు చేసింది. సింగల్ డెస్క్ పోర్టల్ ద్వారా ఇప్పటి వరకు 1464 అనుమతుల కోసం దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 14 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశాం.

ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చు ?

జిల్లాలో లభ్యమైన ముడిసరుకులైన మినరల్స్ , కెమికల్స్ ఉత్పత్తులు, పివిఎస్ పైపులు, ప్లాస్టిక్ క్రెట్స్, నర్సరీ ప్రోటర్స్, ప్లాస్టిక్ పెట్ బాటల్లు , యూపీ విసి విండోస్, డోర్లు , గ్రానైట్స్ , బొరుగులు తయారీ సెమికుక్ ఫుడ్స్ ఫుడ్స్ బయో పంటలైజర్లు , ట్యూటీ పండ్లు మొదలగు పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చు.

రాయితీలో వివరాలు తెలపండి ?

ఇప్పటివరకు అనుమతులు ఉన్న ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ పాలసీ 2020 - 23 వైఎస్ఆర్ జగనన్న బడుగు వికాస పథకం కింద 276 యూనిట్లు, రూ.14.12 కోట్ల పెట్టుబడితో వడ్డీ, సేల్స్ టాక్స్ రాయతీలు మంజూరయ్యాయి. పిఎం ఇజిఎఫ్ పథకం కింద జిల్లా లో పరిశ్రమల ఏర్పాటుకు రూ. 359 లక్షలు కేటాయించగా ఇప్పటివరకు రూ. 49.57 లక్షల రుణాలు మంజూరయ్యాయి. జిల్లాలో అన్ని బ్యాంకుల ద్వారా ఈ పథకం అమలు చేస్తున్నాం. పథకం కింద ఉత్పత్తి రంగానికి గరిష్టంగా రూ. 50 లక్షలు, సేవా రంగానికి గరిష్టంగా రూ. 20 లక్షలు వరకు రుణాలు అందజేస్తున్నాం. ఉత్పత్తి రంగానికి 18 ఏళ్లు, 8వ తరగతి పాస్ అయిన వారు అర్హులు. గ్రామీణ ప్రాంతాల్లోని వారికి గరిష్టంగా 35 శాతం, పట్టణ ప్రాంతం వారికి 25 శాతం శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేస్తాం. ఆన్లైన్‌లో 365 రోజులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పరిశ్రమల ఏర్పాటుకు ఎలాంటి శిక్షణలిస్తున్నారు?

పరిశ్రమలు ఏర్పాటు చేయదలచుకునే అభ్యర్థులు వాటి పట్ల కొంత అవగాహన కల్గి ఉండాలి. పరిస్థితులు అనుగుణంగా ఏ పరిశ్రమలు పెడితే అభివృద్ధి సాధిస్తారో కొంత వరకు అవగాహన అవసరం. ఏర్పాటు చేసిన పరిశ్రమల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి శిక్షణ ఇప్పిస్తాం.

31 నాటికి 'కల్యాణం' ఏర్పాట్లు పూర్తి చేయాలి

టిటిడి ఇఒ ఎ.వి.ధర్మారెడ్డి

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

టిటిడి అధికారులు, జిల్లా యంత్రాంగం కలిసి ఈనెల 31 నాటికి శ్రీ సీతారాముల స్వామివారి కల్యాణానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేయాలని టిటిడి ఇఒ ఎ.వి. ధర్మారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై కడప కలెక్టర్ విజయ్‌రామరాజు, ఎస్‌పి అన్బురాజన్, జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిటిడి అధికారులు, జిల్లా యంత్రాంగం సమన్వయం చేసుకుని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. కల్యాణ వేదిక వద్ద సిసి కెమెరాలు, కంట్రోల్‌రూమ్, బారికేడ్లు, గ్యాలరీలు, విద్యుత్ ఇతర పనులు పూర్తి చేయాలన్నారు. ఈనెలఖరులోగా మరోసారి పనుల పురోగతిపై క్షేత్రస్థాయి సమీక్ష నిర్వహి స్తామన్నారు. శ్రీసీతారాముల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారని చెప్పారు. కల్యానానికి విచ్చేసే భక్తులకు వారి గ్యాలరీల్లోనే అన్నప్రసాదం, తాగునీరు, అక్షింతలు అందించేలా ఏర్పాటు చేస్తామని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ కల్యాణనికి వచ్చే యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

కల్యాణం ఏర్పాట్లపై అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న టిటిడి ఇఒ ఎ.వి. ధర్మారెడ్డి

ఇందులో భాగంగా భద్రత, పార్కింగ్, అన్నప్రసాదాల పంపిణీ, తాత్కాలిక మరుగుదొడ్లు, నిరంతర విద్యుత్ సరఫరా, ప్రథమ చికిత్స కేంద్రాలు, ఆర్టీసీ బస్సుల ఏర్పాటు, హెల్ప్ డెస్క్ లు, సైన్ బోర్డులు, పారిశుధ్యం, విఐపి పాసులు, పార్కింగ్ ప్రదేశాలు,పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాట్లకు సంబంధించి జిల్లా అధికారులతో పాటు టీటీడీ లోని ఆయా విభాగాధిపతులతో కమిటీలు నియమించామన్నారు. ఎస్‌పి మాట్లాడుతూ గత ఏడాది 3,500 మందితో బందోబస్తు ఏర్పాటు చేశామని, ఈ సారి 4 వేల మందిని నియమిస్తున్నామని చెప్పారు. పార్కింగ్, సిసి కెమెరాలు, కంట్రోల్ రూమ్ నిర్వహణకు సంబంధించిన సిబ్బంది రెండు రోజుల పాటు విధుల్లో ఉంటారని తెలిపారు. అనంతరం బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కల్యాణ వేదిక వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో జెఇఒ వీరబ్రహ్మం, జెసి సాయికాంత్‌వర్మ, టిటిడి సిఇ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పిల్లల చదువులు తల్లిదండ్రులకు భారం కాకూడదు

జిల్లాబిసి, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులు

ప్రజాశక్తి - రాయచోటి

పిల్లల చదువులు తల్లిదండ్రులకు ఏ మాత్రం ఆర్థిక భారం కాకూడదన్నదే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని జిల్లా బీసీ సంక్షేమ శాఖ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు సందప్ప, జాకీర్ హుస్సేన్లు సంయుక్తంగా పేర్కొన్నారు .ఆదివారం ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గ కేంద్రంలో బహిరంగ సభ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వర్చువల్ విధానం ద్వారా 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి 'జగనన్న విద్యా దీవెన' లబ్ది మొత్తాన్ని ల్యాప్ టాప్ బటన్ నొక్కి అర్హులయిన విద్యార్థుల తల్లుల ఖాతాలో జమచేశారు. కార్యక్రమానికి కలెక్టరేట్ విసి హాలు నుంచి జిల్లా బీసీ సంక్షేమ శాఖ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి విసి ముగిసిన అనంతరం 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని 35,656 మంది విద్యార్థులకు మంజూరైన లబ్ది మొత్తం రూ. 23.62 కోట్ల మెగా చెక్కును విద్యార్థులు, వారి తల్లులకు మీదుగా అందజేశారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారితో వారు మాట్లాడుతూ దేశ చరిత్రలోనే తొలిసారిగా పూర్తి స్థాయి ఫీజు రీయింబర్సుమెంటు పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేయడం సంతోషకరమన్నారు. నిరుపేద విద్యార్థులకు సైతం ఉన్నత స్థాయి చదువులను చదివే అవకాశం ప్రభుత్వం కల్పించినందుకు లబ్ది పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలుపుకుంటున్నామన్నారు. జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా రాష్ట్రంలో ఐటీఐ, డిప్లమా, డిగ్రీ, ఆపై స్థాయి ఉన్నత విద్యను అభ్యసిస్తున్న ప్రతి విద్యార్థికీ ముఖ్యమంత్రి అందిస్తున్న సువర్ణావకాశం అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న విద్య దీవెన సాయం అందుకుని చదువుపై ఏకాగ్రతతో భవిష్యత్ లక్ష్యం పైపు అడుగులేయాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో మైనారిటీస్ శాఖ, విద్యాశాఖ అధికారులు, జిల్లాలోని పలు డిగ్రీ, ఇంజినీరింగ్ ఇతర ప్రొఫైషనల్ కోర్సుల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు.

మెగా చెక్కును అందజేస్తున్న జిల్లా బిసి,ఎస్‌సి సంక్షేమశాఖాధికారులు

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఉపాధ్యాయుల సమస్యల సాధనకు తన వంతు కృషి చేస్తానని ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలలో విజయం సాధించిన మిట్ట రామచంద్రారెడ్డి తెలియజేశారు. ఆదివారం పట్టణంలోని కాకతీయ పాఠశాలలో ఆయనకు ఆత్మీయ అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తనపై విశ్వాసంతోగెలిపించిన ఉపాధ్యాయులకు, జయానికి కృషిచేసిన నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యావంతులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారంటూ కొందరు పనిగట్టుకుని ప్రచారం చేసినా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయంతోనే ప్రత్యర్థులకు సమాధానం చెప్పారని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సానుకూలంగా ఉన్నారని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డికి తమ వంతు సహాయ సహకారాలు అందించి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పోలా శ్రీనివాసులురెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, అపుస్మా అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి, వైష్ణవి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్, మున్సిపల్ కౌన్సిలర్ పోలారమణారెడ్డి, జడ్‌పిటిసి దాసరి పెంచలయ్య, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గొబ్బిళ్ళ త్రినాథ్ యాదవ్, కార్పొరేషన్ డైరెక్టర్ జాహిద్ అలీ, భాస్కర్ యాదవ్, కౌన్సిలర్లు పెనిగలపాటి పెంచలయ్య నాయుడు, బిల్లా నరేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని అభినందిస్తున్న జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

అంగన్వాడీల అరెస్టు అప్రజాస్వామికం

పోలీస్‌స్టేషన్‌లో అంగన్వాడి నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అంగన్వాడీ సమస్యల పరిష్కారం కోస చలో విజయవాడకు వెళుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి డి. భాగ్యలక్ష్మి, రాయచోటి ప్రాజెక్టు అధ్యక్షురాలు సిద్ధమ్మ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులును అరెస్టు చేయడం అప్రజాస్వామికమని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబిర్, కెవిపిఎస్ జిల్లా కో-కన్వీనర్ డి.సి. వెంకటయ్య పేర్కొన్నారు. ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ అంగన్వాడీలకు తెలంగాణా రాష్ట్రంలో కంటే రూ. వెయ్యి వేతనం అదనంగా పెంచుతామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి ఆ మాటే మరిచారని చెప్పారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక పోయారని వాపోయారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని పేర్కొన్నారు. ప్రభుత్వ ఇప్పటికైనా అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

చెక్కును చిన్నారి తల్లిదండ్రులకు అందజేస్తున్న ఎస్ఐ

చిన్నారికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆర్‌టిసి బస్సులో ప్రయాణిస్తున్న సమయంలో ఎమర్జెన్సీ డోర్ తెరచుకుని కిందపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న చిన్నారి తరుణ్‌కు హెల్పింగ్ మైండ్స్ ఆధ్వర్యంలో ఎస్ఐ చేతుల మీదుగా ఆదివారం ఆర్థిక సాయం చేశారు. బాధితుడి తల్లిదండ్రులు సుబ్రహ్మణ్యం, కాంతమ్మ అభ్యర్థన మేరకు సంస్థ వ్యవస్థపకుడు అబుబాకర్ స్పందించారు. తల్లిదండ్రులకు చంద్రమోహన్‌చే రూ. 60 వేలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పట్టణంలో రక్తదానం, అన్నదానం, సామాజిక సేవ చేస్తున్న హెల్పింగ్ మైండ్‌కు అభినందనలు తెలియజేశారు. సంస్థ వ్యవస్థాపకుడు మాట్లాడుతూ పత్రిక కథనాలు, సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా చిన్నారి తరుణ్ కోసం స్పందించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ సంస్థ సభ్యులు దినకర్, గౌస్, గౌతమ్, కిరణ్, బహుజన రాష్ట్ర నాయకులు కొండపల్లి ఆనంద్, శ్రీ చందు, నాగరాజు, రాఘువేంద్ర, రూపక్ పాల్గొన్నారు.

వైసిపి పతనం ఆరంభమైనట్లే : టిడిపి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

శాసనమండలి పట్టభద్రుల ఎన్నికలలో టిడిపి అఖండ మెజారిటీతో గెలవడంతో వైసిపికి పతనం ఆరంభమైనట్లేనని రాజంపేట నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు చమర్తి జగన్ మోహన్ రాజు అన్నారు. ఆదివారం అయన తన కార్యాలయంలో మాట్లాడుతూ వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడే దిశగా పట్టభద్రులు తీర్పు చెప్పారన్నారు. రాష్ట్రంలో పెను మార్పు రావడానికి ప్రధాన కారణం విద్యావంతులే అన్నారు. టిడిపి బలోపేతానికి యువత కంకణం కట్టుకొని శ్రమించారన్నారు. వారి ఆలోచనా విధానాలే విజయపథంలో నడిపించయన్నారు. ఇదే ఉత్సాహంతో దూసుకుపోయి టిడిపిని అధికారంలోకి తీసుకురావాలని అయన పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల ఫలితాలతో వైసిపి నాయకుల ముఖాల్లో దిగులు కనిపిస్తోందన్నారు. టిడిపి గెలుపును జీర్ణించుకోలేక ఎన్ని కుతంత్రాలు చేశారో అందరికీ తెలుసన్నారు. రాష్ట్ర ప్రజలు వైసిపి ప్రభుత్వానికి తిరస్కరిస్తున్నారన్న భయం వారిలో మొదలైందన్నారు. నాలుగేళ్ల దోపిడీ, దౌర్జన్యాలతో కొనసాగిన వైసిపి అరాచక పాలనలో విసుగెత్తిన ప్రజలు మళ్ళీ చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేసుకొనేందుకు నిర్ణయించుకున్నారని తెలిపారు. యువతలో చైతన్యం రావడమే మన రాష్ట్రానికి అభివృద్ధి సూచిక అని అన్నారు. ఇంతటి ఘనివిజయాన్ని అందించిన పట్టుభద్రులకు, టిడిపి శ్రేణులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పాలకుల నిర్లక్ష్యం వల్లే ట్రాఫిక్ సమస్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాకపోవడానికి పాలకుల నిర్లక్ష్యం కారణం అని పలువురు వక్తలు విమర్శించారు. ఆదివారం స్థానిక స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో 'ట్రాఫిక్ సమస్య-పరిష్కార మార్గాలు' అనే అంశంపై మదనపల్లె అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో చర్చా వేదిక నిర్వహించారు. మదనపల్లె అభివృద్ధి వేదిక నాయకులు హరీంద్రనాథ్‌శర్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మదనపల్లె పట్టణం అడుగడుగునా నిరాధరణకు గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వంద అడుగల రోడ్డు ఆక్రమణలకు గురై 40 అడుగులకు కుచించుకు పోయిందని వాపోయారు. ఆక్రమణలు తొలగించి, రోడ్డుకు ఇరువైపులా మురుగునీటి కాలువలు నిర్మించాలన్నారు. వాటిపై ఫుట్ పాథ్ నిర్మించాలని, సిటియం రోడ్డులో చింతచెట్ల మధ్యలో పార్కింగ్ ఏర్పాటు చేసి, వన్ వే పకడ్బందీగా అమలు చేయాలని, బిజినెస్ ఏరియాలో పార్కింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. భారీ వాహనాలు పట్టణంలోకి రాకుండా మార్కెట్ యార్డును బయటకు తరలించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్ యార్డులోకి వారపుసంతను, వారపుసంత లోకి, దినసరి మార్కెట్, చేపల మార్కెట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మదనపల్లె ట్రాఫిక్ సమస్య పరిష్కారం అయ్యే వరకు అన్ని సంఘాలు, రాజకీయ పార్టీలు కలుపుకొని ఉద్యమం చేయాలని నిర్ణయించారు.

చర్చా కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

కార్యక్రమంలో అపెక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.తిరుపతి రావు, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.టి.నరసింహులు, మదనపల్లె అభివృద్ధి వేదిక నాయకులు, పురం వెంకటరమణ, రిటైర్డ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఉత్తన్న, నవజీవన్ అసోసియేషన్ నాయకులు జి కృష్ణమూర్తి, రచయితల సంఘం నాయకులు కృష్ణమూర్తి, జన విజ్ఞాన వేదిక నాయకులు బాషా, ఎంవి.చలపతి పాల్గొన్నారు.

సంతాన సాఫల్యంతోనే మాతృత్వానికి సంపూర్ణత

-ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ రాయ ఆశాలత

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సంతాన సాఫల్యంతోనే మాతృత్వానికి సంపూర్ణత చేకూరుతుందని ఆశాలత టెస్ట్ ట్యూబ్ సెంటర్ అధినేత్రి, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ రాయ ఆశాలత అన్నారు. ఎందరో మాతృమూర్తుల సంతానలేమి సమస్యను పరిష్కరించడంతో పాటు వారి జీవితాల్లో 'ఆశాలత టెస్ట్ ట్యూబ్ సెంటర్" వెలుగులు నింపుతోందని తెలిపారు. ఆదివారం రాజంపేటలోని డాక్టర్ సుధాకర్ ఆసుపత్రిలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. వైద్యశిబిరాన్ని ముఖ్య అతిథిగా ఆమె విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నత ఆశయంతో పురుడు పోసుకున్న 'ఆశాలత టెస్ట్ ట్యూబ్ సెంటర్' 36 ఏళ్లుగా ఎందరో తల్లుల ఆశాజ్యోతిగా సేవలందిస్తోందన్నారు. సేవాభావంతో పనిచేస్తూ సంతాన సాఫల్యాన్ని సాకారం చేస్తోందన్నారు. ఆధునిక యుగానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకొని బిడ్డలు లేక నిరాశ పడేవారికి నేనున్నానని భరోసానిస్తోందని చెప్పారు. మహిళల ఆరోగ్య సమస్యలకు చక్కటి పరిష్కార మార్గాన్ని చూపిస్తోందని చెప్పారు. ఆశాలత టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత మెడికల్ క్యాంపు మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ రాయలసీమకే తలమానికం ఆశాలత టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ అన్నారు. ఇలాంటి ఆసుపత్రులు నవీన సమాజానికి ఎంతో అవసరమని చెప్పారు. సేవభావంతో పనిచేస్తున్న డాక్టర్ ఆశాలత లాంటి వైద్యులు దేశానికి, రాష్ట్రానికి అవసరమని తెలిపారు.

డాక్టర్ ఆశాలతకు స్వాగతం పలుకుతున్న డాక్టర్ సుధాకర్

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

శ్రీ చైతన్య విద్యా సంస్థలు చేస్తున్న ఆగడాలను నిరసిస్తూ సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ సర్వేపల్లి పేర్కొన్నారు. ఆదివారం ఆర్ఎస్ రోడ్డులో గల ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీ చైతన్య విద్యాసంస్థలు అధిక ఫీజుల వసూళ్లతో తల్లిదండ్రులను నిలువునా దోపిడీ చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిమితికి మించి బస్సులలో విద్యార్థులను తరలించి వారి ప్రాణానికే ముప్పు కలిగేలా వ్యవహరిస్తున్నాయని అన్నారు. సరియైన క్రీడా ప్రాంగణం కూడా లేకుండా విద్యార్థుల మానసిక, శారీరక స్థితిగతులతో చెలగాటమాడుతున్నా ఏ అధికారి పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన చెందారు. పుస్తకాలు, యూనిఫామ్ పేరుతో విచ్చలవిడిగా వ్యాపారం చేస్తున్నారని విద్యను వ్యాపారంగా మార్చిన వారి ఆగడాలను వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. రాజంపేట, మదనపల్లి, పీలేరు లోని శ్రీ చైతన్య పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, నాయకులు కార్తీక్, దినేష్ పాల్గొన్నారు.

విజయానికి కృషి చేసిన అందరికీ ధన్యవాదాలు

- ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వైసిపి నాయకులు ఎన్ని అరాచకాలు సృష్టించినా ధర్మమే విజయం సాధించిందని, ప్రజాస్వామ్యం వైపే ప్రజలు నిలబడ్డారని ఎమ్మెల్సీగా గెలిచిన భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఈ పోరాటంలో ఓటర్లు ధర్మం వైపు నిలిచారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ ఎన్నో అరాచకాలను చేసిందన్నారు. దాదాపు రూ.50 కోట్లు ఖర్చు చేసిందన్నారు. అయినా ప్రజా సమస్యలపై ఎవరు పోరాడతారో ఆలోచించి రాయలసీమ ప్రజలు టిడిపిని గెలిపించారన్నారు. ఈనెల 13న జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి నాయకులు దొంగ ఓట్లు వేయడమే కాకుండా, లింగాల, తొండూరు గ్రామాల్లో తమ పార్టీ కార్యకర్తలపై దాడి చేశారన్నారు. పులివెందులలో కూడా దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నించారని, తాము, పార్టీ కార్యకర్తలు అడ్డుకున్నామన్నారు. రాబోయే 2004 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు టిడిపిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు సర్టిఫికేట్లను అందిస్తున్న ప్రిన్సిపల్ యువరాజ్

జాతీయ స్థాయిలో 'మిట్స్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కురబలకోట

అంగళ్లు సమీపం లోని మిట్స్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు కలికిరి జెఎన్‌టియు యూనివర్సిటీ కళాశాలలో జాతీయ స్థాయిలో నిర్వహించిన సింపోసియం లో ప్రతిభ కనపరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. పేపర్ ప్రజెంటేషన్‌లో మొదటి బహుమతి, క్విజ్ కాంటెస్ట్ లో మొదటి బహుమతి, షార్ట్ ఫిల్మ్ పోటీలో మొదటి బహుమతి, ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో రెండవ బహుమతి, ఆర్ట్ పోటీలో రెండవ బహుమతి పొందినట్లు తెలిపారు. జాతీయస్థాయిలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్ , జ్ఞాపికలను అందజేశారని అన్నారు. గెలుపొందిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ డాక్టర్. ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ ముప్పా లక్ష్మణరావు అభినందనలు తెలిపారు.

పిసిసి మైనార్టీ కార్యదర్శిగా పఠాన్ ఆదాం

ప్రజాశక్తి-కలికిరి

నియామక పత్రాన్ని అందుకుంటున్న పఠాన్

పిసిసిమైనార్టీ కార్యదర్శిగా కలికిరికి చెందిన పఠాన్ ఆదామును నియామించినట్లు పిసిసి మైనారిటీ అధ్యక్షులు సాజి దాదా గాంధీ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఆదేశాల మేరకు పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి సహకారంతో కార్యదర్శి పదవి తగ్గినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని అన్నారు. పార్టీ సిద్ధాంతాలను, కార్యక్రమాలను గ్రామ గ్రామాన ఇంటి ఇంటికి తీసుకొని పోయి క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి స్థానిక నేతలతో కలిసి పనిచేస్తానని చెప్పారు.

కంటి ఆపరేషన్ చేయించుకున్న వృద్ధులతో వైద్యులు

17 మంది కంటి రోగులకు ఆపరేషన్లు

ప్రజాశక్తి-రాయచోటి

మండల పరిధిలోని చెన్నముక్కపల్లి గ్రామంలో లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 17 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో పాటు జిల్లా పరిధిలోని రాజంపేట, రైల్వేకోడూరు, కలికిరి, కలకడ, గుర్రంకొండ, పెద్దమండెం, యర్రా వారిపాలెం, వీరబల్లి, కదిరి, ఎస్‌ఆర్ కుంట ప్రాంతాల నుంచి వచ్చిన 70 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించిన వైద్యులు అందులో అర్హులైన 17 మంది కంటి రోగులకు ఆపరేషన్లు చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 40 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వైవిఆర్ స్వరూప్ గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్ భాష, ఎపిఐఐసి డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, లయన్ డిస్ట్రిక్ట్ చైర్మన్ గాలివీటి శివారామిరెడ్డి, కంటి వైద్యులు సురేష్ బాబు, మహాలక్ష్మి, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్ రెడ్డి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో టిడిపి నాయకులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండల పరిధిలోని సంతబజారులో నివాసముంటున్న జనాబ్ లేట్ షేక్ అబ్దుల్ మజీద్ కుమారుడు డి.షేక్ బాబా వక్తర్‌తో షేక్.అర్షియాల వివాహం ఆదివారం జరిగింది. ఈ వివాహవేడుకకు టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డి.ఎస్.ఎం.పర్వీన్‌తాజ్, నూర్ అహ్మద్ దంపతులు హాజరై వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు. వీరితో పాటు ఎంఎస్.నాసర్ హాజరయ్యారు.

న్యాయవాదుల సంఘం ఎన్నికలకు 14 నామినేషన్లు

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్ర బార్ కౌన్సిల్ సూచనల మేరకు రాయచోటి బార్ అసోసియేషన్ ఎన్నికలకు ఆదివారం14 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ వేయడానికి సాయంత్రం 4.30 గంటలకు గడువు ఉండగా 4.30 గంటలకు డి.రామకుమార్ అనే న్యాయవాది తన నామినేషన్ వేయడానికి ఎన్నికల అధికారి అజంతుల్లా వద్దకు రాగా అక్కడే ఉన్న ప్రత్యర్థి ప్యానెల్ సభ్యులు సమయం మించి పోయిందని అభ్యంతరం వ్యక్తం చేయడంతో రెండు ప్యానెల్ సభ్యులు వాగ్వాదానికి దిగారు. బైలా ప్రకారం న్యాయవాది రామ్ కుమార్ నామినేషన్ పై చర్యలు తీసుకుంటామని ఎన్నికల అధికారి నచ్చ చెప్పడంతో గొడవ సద్దుమణిగింది. నామినేషన్ల పరిశీలన సోమవారం పూర్తికానున్నదని న్యాయవాదులు తెలిపారు. ఈనెల 31న బార్ అసోసియేషన్ ఎన్నికలు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతాయని, ఫలితాలు అదే రోజు సాయంత్రం ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. సీనియర్ న్యాయవాది కె.నాగిరెడ్డి రాయచోటి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నామినేషన్ వేశారు. నాగిరెడ్డి ప్యానల్‌లో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా కె.రాజకుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఉదయగిరి రామాంజనేయులు, సహాయ కార్యదర్శిగా టిపి.రమణ, కోశాధికారిగా దేవప్ప నాగమణి, స్పోర్ట్స్ కార్యదర్శిగా వేముల సిద్ధయ్య, లైబ్రరీ సెక్రెటరీగా ఆదిరెడ్డి నాయక్ ఉన్నారు. మరొక ప్యానల్ అధ్యక్షుడిగా రవిశంకర్ ఉపాధ్యక్షులుగా పరదా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా నాగముల్లు, సహాయ కార్యదర్శిగా వెంకట్రావు, ట్రెజరర్‌గా వీరభద్రయ్య, స్పోర్ట్స్ కార్యదర్శిగా రామ్‌కుమార్, లైబ్రరీ సెక్రెటరీగా వెంకటరమణమూర్తి నామినేషన్లు వేశారు.

మద్యం సేవించి వాహనాలు నడపరాదు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

రోడ్డుపై ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు, కారు, లగేజ్ వాహనం నడిపే డ్రైవర్లు మద్యం తాగి వాహనాలను నడపవద్దని ఎస్ఐ ఫాతిమా తెలిపారు. ఆదివారం సాయంత్రం పిట్టావాండ్లపల్లి వద్ద వాహనాలను తనిఖీ చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం తాగి రోడ్డుపై వాహనాలు నడపటం వలన ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారని అన్నారు. విలువైన ప్రాణాలు కోల్పోయి కుటుంబ సభ్యులను అనాథలు చేయవద్దని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు, డ్రైవర్లు మద్యం తాగి వాహనాలను నడిపితే జరిమానాలతో పాటు, కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్ శివ, రామచంద్ర, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్న ఎస్ఐ ఫాతిమా

ఆశయం భేష్..ఆచరణ నిల్..!

వ్యాయామశాలను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

ఆరోగ్యమే మహాభాగ్యమని..ఆరోగ్య పరిరక్షణకు క్రమం తప్పని వ్యాయామం అవసరమని భావించి ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మండల పరిధిలోని అనంతంపల్లి మాజీ సర్పంచ్ నాగిరెడ్డి హరినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పరిధిలో తన సొంత నిధులు రూ.6లక్షలు వెచ్చించి వ్యాయమశాలను ఏర్పాటు చేశారు. ఒకప్పుడు ఈ వ్యాయామశాల జనాలతో కళకళలాడుతుండేది. ఇప్పుడు జనాలు లేక వెలవెలబోతుంది. ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. మాజీ సర్పంచ్ ఆశయం చాలా మంచిదని, ఆచరణకు నోచుకోవడం లేదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాయామశాల మధ్యలో పెరిగిన కంపచెట్లను తొలగించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. మునుపటి వలె యధాతథంగా జనాలు కళకళలాడే విధంగా అధికారులు, నాయకులు స్పందించి వ్యాయామశాలను పునరుద్ధరించాలని కోరుతున్నారు. మాజీ సర్పంచ్, ఎఇలు ఇద్దరూ స్థానికులు కావడంతో వ్యాయామశాల ఏర్పాటుకు కృషి చేశారని తెలిపారు.

ఆరోగ్యం కోసమే వ్యాయామం

వయసు పైబడడంతో కొన్ని అనారోగ్య సమస్యలు తలెత్తాయి. వైద్యుడిని సంప్రదిస్తే మందుల తో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయమని సూచించారు. గతంలో ఇక్కడ వ్యాయామశాల సౌకర్యవంతంగా ఉండడంతో ఇందులో ప్రతిరోజు వ్యాయామం చేసేవాడిని. వ్యాయామశాలను మళ్లీ పునరుద్ధరించి అందుబాటులోకి తీసుకుని వస్తే నాలాంటి వారికి ఎందరికో ప్రయోజనకారిగా ఉంటుంది.

- నారపు రెడ్డి బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, అనంతంపల్లి

ముళ్ల పొదలతో నిండిన వ్యాయమశాల, నిరుపయోగంగా పరికరాలు

స్థూలకాయం నుంచి కోలుకోవడానికే

అచ్యుత్ రెడ్డి

ప్రతి మనిషి ఎత్తుకు తగిన బరువు ఉండాలి. కానీ నా ఎత్తుకు నుంచి అధిక బరువు ఉండడంతో వైద్యుని సలహా మేరకు ప్రతిరోజు వ్యాయామం చేస్తున్నాను. ఇక్కడి వ్యాయామశాలను పునరుద్ధరిస్తే నాలాంటి వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. వ్యాయామశాల పునరుద్ధరకు సహకరించాలి.

-ఎన్.అచ్యుత్ రెడ్డి,అనంతంపల్లి

సంక్షేమ పాలన టిడిపితోనే సాధ్యం: ఆర్ఆర్

ఇదేంఖర్మ కార్యక్రమంలో రమేష్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-చిన్నమండెం

రాష్ట్రంలో సంక్షేమ పాలన టిడిపితోనే సాధ్యమని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని దిగువ గొట్టి వీడు గ్రామంలో ఇదేంఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి వైసిపి పాలనలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి ఎన్ని ప్రలోభాలు పెట్టినా పట్టభద్రులు టిడిపిని అధిక మెజార్టీతో గెలిపించారన్నారు. వైసిపి పాలనపై ఎంత వ్యతిరేకత ఉందో ఇప్పటికే స్పష్టమైందన్నారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అత్యధిక మెజార్టీతో విజయం సాధించడం వెనుక పట్టభద్రుల కృషి ఎంతో ఉందన్నారు. 36 మంది ఎమ్మెల్యేలు, జడ్‌పి చైర్మన్లు, ఆరుగురు ఎంపీలు, 167 మంది జడ్‌పిటిసిలు, మండల ప్రెసిడెంట్లు అనేక రకాల కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు ఉన్న పట్టభద్రుల దాటికి వాళ్ళ పరపతి కూడా కాలగర్భంలో కలిసిపోయింది అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కోసం ప్రజలు టిడిపి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బెల్లం నర్సింహారెడ్డి, హరి అమర్నాథరెడ్డి, పొలిమేరపల్లి చెన్న కృష్ణారెడ్డి, అలగాని రెడ్డప్ప, దేవ గోపాల నాయుడు పాల్గొన్నారు.

ఓటరు కార్డుకు ఆధార్‌తో అనుసంధానం

ప్రజాశక్తి -బి.కొత్తకోట

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని రాష్ట్రాలు ఓటర్ ఐడితో ఆధార్ కార్డు అనుసంధాన ప్రక్రియ చేపట్టాయి. ఆదివారం బిఎల్‌ఓలు పట్టణంలో ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటరు కార్డు కలిగిన ప్రతి ఒక్కరు ఆధార్ కార్డుతో తప్పని సరిగా అనుసంధానం చేసుకోవాలన్నారు. . కార్యక్రమంలో నగర పంచాయతీ ఆర్ఐ.శ్రీనివాసులు, విఆర్‌ఒలు, విఆర్‌ఎలు వెరిఫికేషన్ చేసి ఆధార్ కార్డును, ఓటరు ఐడికి అనుసంధానం చేశారు. **వాల్మీకిపురం :** ఓటు హక్కు కలిగిన ప్రతి ఓటరు తమ ఓటర్ కార్డుకు ఆధార్ కార్డును అనుసంధానం చేసుకోవాలని తహాశీల్దార్ ఫిరోజ్ ఖాన్ తెలిపారు. ఆదివారం మండలంలోని 16 పంచాయతీల్లో విఆర్‌ఒలు, విఆర్‌ఎలతో కలసి గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫిరోజ్ ఖాన్ మాట్లాడుతూ ఓటర్ కార్డుకు ఆధార్‌ను ఈ నెల 30వ తేదిలోపు అనుసంధానం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓటర్ కార్డుకు, ఆధార్ కార్డు అనుసంధానం చేస్తున్నామని, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో ఓటర్‌కార్డును తొలగించడం జరుగు తుందన్నారు. కార్యక్రమంలో విఆర్‌ఓలు సుధాకర్, సంజీవ్, రెడ్డెప్ప, సౌజన్య, విఆర్‌ఏలు పాల్గొన్నారు. **పీలేరు :** ఓటర్లు తమ ఓటు హక్కును సవ్యంగా వినియోగించుకోడానికి వీలుగా తమ ఓటరు కార్డును ఆధార్ తో విధిగా అనుసంధానం చేసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గోపాలకృష్ణ తెలిపారు. ఆదివారం పట్టణంలోని బండ్ల వీధిలో ఆయన మాట్లాడుతూ పీలేరులో అతి తక్కువ శాతం మంది మాత్రమే ఓటరు కార్డును ఆధార్‌తో లింక్ చేసుకున్నారని తెలిపారు. తాము బూత్‌ల వారీగా తిరిగి అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టరుతో పాటు పీలేరు ఎన్నికల డిప్యూటీ తాహశీల్దారు కిరణ్, బిఎల్‌ఒలు జగదీష్ రెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

పట్టభద్రులు టిడిపికి పట్టం కట్టడం హర్షణీయం

ప్రజాశక్తి -చిట్వేలు

తెలుగుదేశం పార్టీ మూడు ఎమ్మెల్సీ స్థానాలు కైవసం చేసుకో వడంతో ఆదివారం దేశం నాయకుల సంబరాలు అంబరాన్ని అంటాయి. టిడిపి మండల అధ్యక్షుడు కెకె.చౌదరి పిలుపుమేరకు మండలంలోని స్థానిక ఎన్‌టిఆర్ కూడలి వద్ద పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో చేరుకొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి, కేక్ కట్ చేసి టపాసాల పేల్చి సంబరాలు జరుపుకున్నారు. వైసిపి ఎన్ని ప్రలోభాలకు గురి చేసిన పట్టభద్రులు తమ ఓటుతో బుద్ది చెప్పారన్నారు. కార్యక్రమంలో ఏదోటి రాజ శేఖర్, న్యాయవాది బాలాజీ, బాలకృష్ణ యాదవ్, పెద్దూర్ రాజా, ఎస్‌సిసెల్ మండల అధ్యక్షుడు కొత్తూరు ఈశ్వరయ్య, గుండాలయ్య యాదవ్, సత్యనారాయణ, గూడూరు నాగరాజు, వెంకటసుబ్బయ్య, నాగయ్య యాదవ్, తమ్మిశెట్టి శ్రీనివాసులు, కరీం భాష, అనంత యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పథకాలను ప్రజలకు చేరువ చేయండి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేయడంలో వైసిపి అనుబంధ సోషల్ మీడియా కన్వీనర్లు ముందు ఉండాలని ఎపి ఎండిసి డైరెక్టర్ హరీష్‌రెడ్డి అన్నారు. వైసిపి సోషల్ మీడియా కన్వీనర్‌గా వాల్మీకిపురంకు చెందిన సయ్యద్‌సాబ్‌వల్లి నియమితులయ్యారు. ఆదివారం ఎపిఎండిసి డైరెక్టర్ హరీష్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్చం అందించి, దుశ్శాలువాతో సన్మానించారు. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శీనా, మౌలాలి, రాజన్న, కిట్టు, నవాజ్, సద్దాం, రెడ్డి పాల్గొన్నారు.

ప్రయివేట్ బస్సులో పొగలు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఓ ప్రయివేట్ బస్సులో నుంచి పొగలు రావడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. మదనపల్లి నుంచి తిరుపతికి వెళ్తున్న ఓ ప్రయివేట్ బస్సు వాల్మీకిపురం గాంధీబస్టాండ్ వద్ద పొగలు వచ్చి నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. బస్సులు, ఆటోలు, కార్లకు కాలపరిమితి దాటిపోవడం, ఇంజన్ కండీషన్‌లో లేకపోవడం, వాహనాల్లో నుంచి పొగలు వస్తుండడంతో వెనుక వైపు వెళు తున్న ప్రజలు, ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. వాహనాలు కండీషన్‌లో లేకపోయినా రవాణాశాఖ అధికారులు పట్టించుకోకుండా కార్యాలయాల్లో వచ్చే ఆదాయాలను చూసుకుంటుండడంతో రోడ్డుపై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మదనపల్లి నుంచి తిరుపతి, చిత్తూరు, గుర్రంకొండకు వెళు తున్న బస్సులు కండీషన్‌లో లేకపోయినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల ఓ ప్రయివేట్ బస్సు వాల్మీకిపురం సమీపంలో రెండు సార్లు ప్రమాదానికి గురై ప్రయాణికులు ప్రమాదాలకు గురైనట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ రవాణాశాఖ అధికారులు నిద్రమత్తు వీడి కండీషన్‌లో లేని వాహనాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జాతీయ రహదారిపై చెత్తాచెదారాలు

ప్రజాశక్తి-రామాపురం

మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు కూత వేట దూరంలో గల జాతీయ రహదారిపై భారీ కేట్ల వద్ద చెత్తాచెదారాలకు ఆలవాలమైందని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. వీటి ద్వారా దోమలు పెరిగి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పలమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చెత్త వేయడం మానడం లేదన్నారు. డంపింగ్ యార్డులు ఉన్నప్పటికీ నామమాత్రంగానే చెత్తాచెదారం తరలింపు జరుగుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి చెత్తాచెదారం దూర ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రంజాన్ కిట్లు పంపిణీ

కడప అర్బన్ :నగరంలోని బెల్లం మండి వీధిలోని మదరసా ఏ జేహరలో జమాతే ఇస్లామి హింద్ కడప శాఖా వారి ఆధ్వర్యంలో పవిత్రమైన రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని పేదలకు బియ్యం ప్యాకెట్లు, నిత్యవసర సరుకులు ఆదివారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఫిమ్స్ సెక్రటరీ ఏ.క్యూ జవ్వాద్, దంత వైద్యులు డాక్టర్ షేక్. నజీముద్దీన్ హాజరయ్యారు. కార్యక్రమంలో జమాత్ ఇస్లామీ హింద్ కడప శాఖ అధ్యక్షులు ఎస్.రియాజ్ బాషా, ఎంపిజె అధ్యక్షులు వి.ఎస్ రహమతుల్లా, జెఐహెచ్ రాష్ట్ర కార్యదర్శి జె.అబ్దుల్లా ఖాన్, రాష్ట్ర సభ్యులు సయ్యద్ ఇందాదుల్లా హుసేని, సభ్యులు పాల్గొన్నారు.

విశ్వమానవ ప్రయోజనానికి కళలే పరమావధి

ప్రజాశక్తి కడప అర్బన్

విశ్వమానవ ప్రయోజనానికి కళలే పరమావధి అని, కళ అంటే భావప్రకటనమని, అది సంగీతమైనా, చిత్రలేఖనమైనా, నాట్యమైనా భావవ్యక్తీకరణే దాని ప్రయోజనమని, మానవీయ శాస్త్రాల పీఠం డీన్ ఆచార్య తప్పెట రామప్రసాద రెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం లలిత కళల విభాగం కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీతం, కీబోర్డు విద్యార్థులు కడపలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో ఆదివారం విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే ఏదో ఒక కళ నేర్చుకోవడంలో దృష్టి పెట్టినవారిలో ఎదుగుదలలో, వ్యక్తిత్వంలో తప్పనిసరిగా మార్పు కనిపిస్తుందని చెప్పారు. కళల చేతనే మానవ జీవితానికి వికాసముంటుందని తెలిపారు. శ్రీహరి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ జి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ మానవుని జీవితంలో సర్వసామాన్యాల్కైన కలతలకు, వేదనలకు దివ్య ఔషధం సంగీతమని చెప్పారు. కార్యక్రమంలో లలితకళల విభాగం అధ్యాపకులు డాక్టర్ కొప్పోలు రెడ్డిశేఖర్ రెడ్డి, వలసిగాండ్ల సుధాకర్, సిహెచ్.వెంకటేష్, చినరాయుడు, అప్పలాచారి, ఈరప్ప, కూచిపూడి నృత్యం, కర్నాటక సంగీతం, కీబోర్డు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వర్క్ షాప్‌లో డాక్టర్ వైఎస్ఆర్ ఎఎఫ్ఎయు విద్యార్థులు

కడప అర్బన్ : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 17,18 తేదీలలో యుజిసి సహకారంతో "దేశీయ కళలు, సమకాలీన పద్ధతులు" అనే అంశంపై నిర్వహించిన సెమినార్ లో డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ శిల్ప కళా విభాగం కు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సెమినార్ ద్వారా విద్యార్థిని విద్యార్థులందరూ దేశీయ కళలను సమకాలిన పద్ధతులలో ఏ విధంగా తయారు చేయవచ్చు అనే అంశాల పైన ఒక అవగాహనతో పాటు ఇతర విశ్వవిద్యాలయాల విద్యార్థిని విద్యార్థులతో ఒక పరస్పర అవగాహన ఉంటుంది అని తెలుసుకున్నారు. కార్యక్రమానికి ప్రోత్సహించిన విశ్వవిద్యాలయం వి సి ఆచార్య బి. ఆంజనేయ ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఈ.సీ. సురేంద్ర నాథ్ రెడ్డికి, ఆహ్వానించిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, డిపార్ట్మెంట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, హెచ్.ఓ.డి పి.శ్రీనివాస్, శిల్ప విభాగానికి సంబంధించిన అధ్యాపకులు కె.సుకుమార్ రెడ్డి, కె.అప్పలనాయుడు ధన్యవాదాలు తెలిపారు.

వైఎస్ఆర్ ఆసరా నిధులపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎపిఎం

ఆసరా నిధులతో జీవన ప్రమాణాలు మెరుగు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

వైఎస్ఆర్ ఆసరా మూడవ విడత నిధులను సద్వినియోగం చేసుకొని, జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవాలని మండలంలోని డ్వాక్రా సంఘ సభ్యులకు వెలుగు మండల ఎపిఎం రజనీకుమారి ప్రత్యేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించారు. ఈనెల18 నుంచి 24 తేదీ వరకు మండలంలోని సంఘమిత్రలతో కలసి గ్రామాలలో పర్యటిస్తూ ఆసరా లబ్ధిదారులకు నిధుల సద్వినియోగంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మూడవ విడత వైయస్సార్ ఆసరా నిధులు రూ.5,12,86,592 మండలంలోని 591 మంది డ్వాక్రా సంఘ సభ్యులు లబ్ధి పొందనున్నట్లు వివరించారు. ఆసరా నిధులను అందుకోనున్న సంఘ సభ్యుల జాబితాను సచివాలయాల్లో ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. మొదటి, రెండో విడతలో పొందిన నగదుపై మూడవ విడతలో పొందుతున్న నగదును సంఘ సభ్యుల జీవన ప్రమాణాలను మెరుగుపరచుకోవటానికి ఉపయోగించుకోవాలని సూచించారు. కార్య క్రమంలో సంఘమిత్రలు, డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు.

25న వాహనాలకు వేలం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఈ నెల 25న ఎస్‌పి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు మదనపల్లి డిఎస్‌పి కేశప్ప, సిఐశివాంజనేయులు పర్యవేక్షణలో వివిధ కేసులో పట్టుబడిన 23 వాహనాలకు వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ రామ్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 17 ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలు, ఒక కారుకు వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనవచ్చని , స్టేషన్‌కు వచ్చి వాహనాలను చూడవచ్చని తెలిపారు.

అకాల వర్షాలతో అపార నష్టం

ప్రజాశక్తి- కలకడ

వడగండ్ల వానకు దెబ్బతిన్న బొప్పాయి తోట

గత రెండు రోజులుగా మండలంలో కురిసిన అకాల వర్షాలకు అపారమైన పంట నష్టం వాటిల్లింది. శనివారం ఉన్నట్టుండి ఆకాశంలో మబ్బులు కొమ్ముకోవడం ఈదురు గాలులు వీస్తూ వర్షం కురిసింది. మండల పరిధిలో టమోటా, వరి, వేరుశనగ, బొప్పాయి, వంకాయ, మిరప తదితర పంటలు వడగండ్ల వానకు పూర్తిగా దెబ్బతిన్నాయి. అకాల వర్షంతో పంటలు నష్టపోయిన రైతులు లబోదిబోమంటూ విలపిస్తున్నారు. పంటలను పూర్తిస్థాయిలో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.**గుర్రంకొండ :** అకాల వర్షంతో పడమటి రైతులకు కన్నీరు మిగిలింది. ఈదురు గాలులు, వడగండ్ల వర్షం కురవడంతో మామిడి, టమోటా రైతులు భారీగా నష్టపోయారు. శనివారం రాత్రి వడగండ్ల వర్షం కురవడంతో ఉద్యాన పంటలపై పెట్టుకున్న ఆశలన్నీ నిరాశ గాని నిలిచాయి. మామిడి తోటల్లో ఈనెలలో చిన్నచిన్న కాయలు అవుతున్న సమయంలో ఇలాంటి దుస్థితి ఏర్పడడం పట్ల రైతులు నిరాశ చెందారు. వేల హెక్టాలలో టమోటాను పడమటి మండలాల్లో సాగు చేస్తున్నారు. అకాల వర్షం వల్ల వడగండ్ల వర్షంతో పంట మొత్తం చిన్న భిన్నంగా కొమ్మలు కాయలు విరిగి నేలపాలయ్యాయి. ఇప్పటివరకు వ్యవసాయ అధికారులు, ఉద్యానవన అధికారులు కన్నెత్తి చూడని దాఖలాలు లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన రైతులు ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు

ఏడాదిగా వెలగని వీధి దీపాలు

రామాపురం : మండల కేంద్రం రామాపురంలో గత ఏడాదిగా జాతీయ రహదారిపై ఎంతో అట్టహసంగా ఏర్పాటు చేసిన వీధి దీపాలు, ఫ్లడ్ లైట్స్ వెలుగుకు నోచుకోవడం లేదు. ఉగాది, రంజాన్ పండుగల నాటికైనా వీధి దీపాలు వెలిగేనా ప్రజలు ఎదురు చూస్తున్నారు. త్వరలో రంజాన్ పండుగ ప్రారంభం అవుతుందని రోజులో ఐదు పూటల నమాజుకు వెళ్లాల్సి ఉంటుందని అన్నారు. మూడు పూటలా రాత్రులు, తెల్లవారుజామున నమాజ్ కు వెళ్లాల్సి ఉంటుందని విద్యుత్ దీపాల లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఒక రామాపురం మినహా గువ్వలచెరువు, గంగనేరు, పాలన్నగారిపల్లె కొండవాండ్లపల్లి, చిట్లూరు, టోల్గేట్, రింగ్రోడ్ వరకు గల వీధి దీపాలు వెలుగుతున్నాయని ఇక్కడ మాత్రం వెలగకుండా ఉండడానికి జాతీయ రహదారి సిబ్బందే కారణమని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా సిఆర్‌పిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-కలికిరి

సిఆర్‌పిఎఫ్ 84వ ఆవిర్భావ దినోత్సవాన్ని కలికిరిలోని సిఆర్‌పిఎఫ్ సిఐఎటి స్కూల్‌లో కమాండెంట్ కెసి.నిర్మల్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సిఆర్‌పిఎఫ్ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిఆర్‌పిఎఫ్ 1939లో మధ్యప్రదేశ్‌లో ఆవిర్భవించిందని, అప్పుడు దాన్ని క్రౌన్ రిప్రజెంటేటివ్ పోలీస్‌గా పిలిచేవారని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం అప్పటి హోంశాఖమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ సిఆర్‌పిఎఫ్ గా నామకరణం చేశారని తెలిపారు. ఈ సంస్థ ఆవిర్భవించడానికి ముఖ్య కారణం దేశంలో జరిగే అంతర్గత సమస్యలు, దేశ సరిహద్దులతో పాటు అత్యవసర పరిస్థితుల్లో సిఆర్‌పిఎఫ్ సిబ్బంది రక్షణగా ఉంటారని, వీరికి శిక్షణ ఇవ్వడానికి ఏర్పాటు చేసి కొత్తగా ఎంపికైన వారికి శిక్షణ ఇవ్వడానికి పాఠశాలలు ఏర్పాటు చేసి వారి నైపుణ్యాలను పెంపొందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జవాన్లందరూ వాలీబాల్ మ్యాచ్ నిర్వహించి, బడాఖాన ఏర్పాటు చేసి కుటుంబ సభ్యులందరూ పాల్గొనడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్ కదం సింగ్, అసిస్టెంట్ కమాండెంట్ హనుమాన్ రామ్, కే రవికుమార్, కే గిరిధర్ తదితర సిఆర్పిఎఫ్ అధికారులు, జవాన్లు పాల్గొన్నారు.

గౌరవ వందనం చేస్తున్న కమాండెంట్ కెసి.నిర్మల్

క్రైం కార్నర్

మహిళను గాయపరిచిన వారిపై కేసు నమోదు

ప్రజాశక్తి-కలకడ

మహిళను గాయపరిచిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రెడ్డి బాబు తెలిపారు. మండల కేంద్రమైన కలకడ పటాన్ వీధికి చెందిన షేక్ అప్సాద్ భార్య షేక్ బాను ఇంటి పక్కన ఉన్న కొబ్బరి చిప్పలు ఎత్తివేయడం లేదని అడిగినందుకు అదే వీధికి చెందిన పటాన్ దర్బార్ అలీ ఖాన్ ,అతని భార్య పటాన్ మస్తానీ, వారి కుమారుడు పఠాన్ ఇమ్రాన్ ఖాన్ ,కుమార్తెలు అప్రోజా, ఆఫ్రిన్ లు, కలసి భానును కొట్టి గాయపరచడంతో భాను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.